నేటి కందం- నేటికి అందం

క్రాంతిని తొలగించగ-వి
క్రాంతిని కలిగించి మిగుల కాంతులు జిమ్మన్
శాంతిగ జీవించ-నవి
శ్రాంతమ్ముగ మనము కృషిని జరుపంగ వలెన్

(మే 16 శాంతికొరకు కలిసి జీవించే అంతర్జాతీయ దినం)



-రాధశ్రీ
సెల్:9494481210

# నేటి నిజం

తెలుగు దినపత్రిక

హింస ఉగ్రవాదం
హితం కాదు ఎవరికి
భస్మాసుర హస్తమై
బలిగొంటది చివరికి
గత చరితం నేర్పేది
గొప్పనైనా ఇదే నీతి
సహజీవన శాంతితో
సాగమనే బతుకు రీతి

చురక



-వేల్పుల నారాయణ
9440433475

website2:www.netinijam.com2 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ శుక్రవారం 16-5-2025 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93· Postal No. HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-50 001. సంపుటి :31 సంచిక:220 పేజీలు:6 వెల: రూ.1/-


## పాక్ నుంచి అణ్వాయుధాలను స్వాధీనం చేసుకోవలసిందే

**-అంతర్జాతీయ అణుశక్తి సంస్థను కోరిన రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్**
**-"ఆపరేషన్ సిందూర్" అనంతరం చేపట్టిన శ్రీనగర్ పర్యటన**
**-పహాల్గాం మృతులకు సంతాపం**
**-శ్రీనగర్ ఆర్మీ శిబిరంలోని జవాన్లతో మాటా మంతి**
**-ఉగ్రవాద పోరులో మీ పోరాటం ప్రశంసనీయమన్న రక్షణ మంత్రి**

శ్రీనగర్ , మే 15: బాధ్యాతారాహిత్యంగా ఉండే పాకిస్థాన్ వద్ద ఉన్న అణ్వాయుధాలు భద్రంగా ఉన్నాయా..? అని కేంద్ర రక్షణమంత్రి రాజ్ నాథ్ సింగ్ ప్రపంచాన్ని ప్రశ్నించారు. అంతర్జాతీయ అణుశక్తి సంస్థ పాక్



నుంచి అణ్వాయుధాలను తీసుకొని పర్యవేక్షించాలని ఆయన డిమాండ్ చేశారు.

నేటి ఉదయం జమ్మూ కశ్మీర్‌లోని శ్రీనగర్‌లో రాజ్ నాథ్ పర్యటించారు. ఆయనకు ఆర్మీ చీఫ్ ఉపేంద్ర ద్వివేది స్వాగతం పలికారు. పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత దళాలు నిర్వహించిన "ఆపరేషన్ సిందూర్" అనంతరం ఆయన చేపట్టిన తొలి పర్యటన ఇది. ఈ పర్యటనలో రక్షణ మంత్రి భారత సాయుధ దళాల సిద్ధతను సమీక్షించారు. పాక్ సరిహద్దుల్లో వడిన షెల్స్‌ను పరిశీలించారు. అనంతరం శ్రీనగర్‌లోని ఆర్మీ 15 కార్ప్స్ ప్రధాన కార్యాలయాన్ని సందర్శించి జవాన్లతో ముచ్చటించారు.

ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ఉగ్ర శిబిరాలు ఎక్కడ ఉన్నా నాశనం చేస్తామని చెప్పారు. టెర్రరిస్టులతో పోరాడి ప్రాణత్యాగాలు చేసిన జవాన్లకు శిరస్సు వంచి నివాళు లర్పిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆపరేషన్ సిందూర్ అనేది కేవలం ఒక పేరు మాత్రమే కాదని.. అదొక కమిట్మెంట్ అని పేర్కొన్నారు.

భారత్ పై ఉగ్రదాడి జరిగితే.. దానిని యుద్ధ చర్యగానే పరిగణిస్తామన్నారు. మన దళాలు అద్భుతంగా పోరాడుతున్నాయని పేర్కొన్నారు. ఇంతటి ప్రతికూల పరిస్థితుల్లో కూడా వారి మధ్య ఉన్నందుకు గర్వంగా ఉందని పేర్కొన్నారు. పహల్గాం ఉగ్రదాడి మృతులకు ఆయన నివాళు లర్పించారు. ఉగ్రవాద పోరాటంలో ప్రాణత్యాగం చేసిన అమర జవాన్లకు నేను వందనం చేస్తున్నానని అన్నారు.. వహాల్గాం దాడిలో ప్రాణాలు కోల్పోయిన పౌరులకూ నివాళులు అర్పిస్తున్నానని అంటూ గాయపడిన జవాన్లు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నానని అన్నారు. అలాగే ఆపరేషన్ సిందూర్‌ను "భారత వైమానిక దళాల అతిపెద్ద ప్రతీకార చర్య"గా అభివర్ణించిన రాజనాథ్ సింగ్, ఉగ్రవాదాన్ని నివారించేందుకు అవసరమైతే ఏ స్థాయికైనా వెళ్లడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. ఉగ్రవాదులను అక్కడ అడ్డుకోవాలంటే పాకిస్తాన్ ఉగ్రవాదులకు ఆశ్రయం ఇవ్వడం ఆపాలని ఆయన పేర్కొన్నారు.

## సరస్వతీ పుష్కరస్నానం ఆచరించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

కాళేశ్వరం మే 15 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);కాళేశ్వరం వద్ద సరస్వతీ పుష్కరాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సరస్వతి పుష్కరస్నానం ఆచరించారు. గురువారం సాయంత్రం కాళేశ్వరం చేరుకున్న సిఎం రేవంత్.. సరస్వతీ పుష్కర ఘాట్ ను ప్రారంభించారు. అనంతరం మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిలతో కలిసి పుష్కరస్నానం ఆచరించారు. ఆ తర్వాత సరస్వతీదేవి విగ్రహాన్ని సిఎం ఆవిష్కరించారు.కాగా, జయశంకర్ భూపాలపల్లి జిల్లా, శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర స్వామి దేవస్థానం కాళేశ్వరం వద్ద గోదావరి, ప్రాణహిత, సరస్వతీ నదులు కలిసి త్రివేణి సంగమంగా ప్రవహిస్తోంది. కాళేశ్వర క్షేత్రం వద్ద త్రివేణి సంగమ తీరంలో ఇవాళ్టి నుంచి ఈనెల 26వ తేదీ



వరకు సుమారుగా 12 రోజుల పాటు సరస్వతీ నది పుష్కరాలు జరుగును న్నాయి. ఈ నేపథ్యంలో అధికారులు.. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. కాళేశ్వరం యాప్, వెబ్ పోర్టల్‌ను ప్రారంభించి, భక్తులు సాంకేతికంగా పొందే సేవలను సైతం అందులో పొందుపరిచారు. సదరు పుష్కరాల సందర్భంగా ప్రతి రోజు సుమారు 50 వేలకు పైగా భక్తులు వచ్చి పుష్కర స్నానం చేయడంతో పాటు పిండప్రదానం, దంపతీ స్నానం, శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర స్వామి వార్లను దర్శనం చేసుకునేలా ఏర్పాట్లు చేశారు.

## యాదగిరిగుట్టకు అందాల భామలు !

వరంగల్, మే 15:మిస్ వరల్డ్ పోటీదారుల బృందం ఈరోజు (గురువారం) యాదగిరిగుట్టను సందర్శించింది. భారతీయ సాంప్రదాయ చీరలలో వారు ఆలయాన్ని సందర్శించారు.

ఈ సందర్భంగా, ఆలయ అధికారులు ప్రపంచ అందగత్తెలకు ఘన స్వాగతం పలికారు.

తరువాత, వారు స్వామిని దర్శించుకుని అఖండదీపరాధనలో పాల్గొన్నారు.



**పోచంపల్లిలో ఆఫ్రికా భామలు !**

మరోవైపు పోచంపల్లిని మరో పోటీదారుల బృందం సందర్శిస్తోంది. ఆఫ్రికా ఖండానికి చెందిన 25 మంది బృందంలో ఉన్నారు. ప్రపంచ సుందరీమణుల ఆ అందగత్తెలు ఇక్కత్ చీరల ప్రత్యేకత మరియు తయారీ ప్రక్రియను పరిశీలించారు..

## సింగరేణిలో బ్లాస్టింగ్.. త్రుటిలో తప్పిన ప్రమాదం



హైదరాబాద్, మే 15:సింగరేణి సంస్థ నిర్వహించిన బ్లాస్టింగ్ కారణంగా పెను ప్రమాదం తప్పింది. పెద్దపల్లి జిల్లా రామగిరి మండలంలోని నాగేపల్లి గ్రామంలో 20కి పైగా ఇళ్లలో స్వల్పంగా బండరాళ్లు పడడంతో రేకులు ధ్వంసమయ్యాయి. పల్లెర్ల హారిక, రేణిగుంట్ల రాజమల్లు, పల్లెర్ల నరసయ్య, పల్లెర్ల పోచాలుకు స్వల్ప గాయాలయ్యాయి. లద్నాపూర్ గ్రామం నుండి బొక్కల వాగులోని వర్షపు నీరు వెళ్లేందుకు కాలువ తీస్తున్న క్రమంలో మధ్యలో పెద్ద బండ రాయి రావటంతో సింగరేణి సంస్థ అదికారులు బండను తొలగించేందుకు బ్లాస్టింగ్ ఏర్పాటు చేశారు.

నాగేవల్లి గ్రామానికి అతి సమీపంలో బ్లాస్టింగ్ చేయడం వల్ల బ్లాస్టింగ్ ధాటికి పెద్ద పెద్ద రాళ్లు ఎగిరి వెళ్లి పక్కనే ఉన్న జనవాసాలు, ఇళ్ల పైకప్పులపై పడడంతో పెద్ద ప్రాణాపాయం తప్పింది. ఆర్జీ- 3 జీఎం సుధాకర్ రావు, రామగుండం ఏసీపీ మడత రమేష్, మంథని సిఐ రాజు గౌడ్, రామగిరి ఎన్ఐ చంద్రకుమార్, పోలీస్ సిబ్బంది ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకున్నారు. నాగేపల్లి గ్రామస్తులు సింగరేణి యాజమాన్యానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ గంటపాటు రాస్తారోకో నిర్వహించారు. ఏసీపీ రమేష్ వారిని శాంతింపజేసి రాస్తారోకో విరమింప జేశారు.

రెండు రోజుల్లో నష్టపరిహారం అందించాలి? ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు

బ్లాస్టింగ్ వల్ల జరిగిన ఘటనపై స్పందించిన ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు బాధిత కుటుంబాలకు వెంటనే నష్టపరిహారాన్ని చెల్లించాలని, రెండు రోజుల్లో చెల్లింపు ప్రక్రియ పూర్తి కావాలని ఆదేశించారు.

## జవాన్ పూర్ణం కుమార్ కు చిత్ర హింసలు - పాక్ దుశ్చర్యలపై ఆర్మీ నోట్ విడుదల

**-21 రోజుల పాటు చిత్ర హింసలు పెట్టినట్లు వెల్లడి**
**-నిద్రపోనివ్వకుండా మాటల యుద్ధం**
**-భోజన సమయంలో మినహా కళ్లకు గంతలు విప్పని వైనం**

న్యూఢిల్లీ, మే 15:పంజాబ్ సమీపంలోని అంతర్జాతీయ సరిహద్దు వద్ద పొరపాటున పాకిస్థాన్ భూభాగంలోకి ప్రవేశించిన భారత సరిహద్దు భద్రతా దళానికి (బీఎస్ఎఫ్) చెందిన జవాన్ పూర్ణమ్ కుమార్ షా పాక్ సైనికుల చేతిలో చిత్రహింసలకు గురైన విషయం తాజాగా వెలుగులోకి వచ్చింది. 21 రోజుల పాటు పాక్ నిర్బంధంలో ఉన్న ఆయనను ఎట్టకేలకు భారత అధికారులకు అప్పగించారు.

పాకిస్థాన్ అధికారులు జవాన్ కుమార్ షాను అదుపులోకి తీసుకున్న తర్వాత అత్యంత దారుణంగా వ్యవహరించినట్లు ఆర్మీ ఒక ప్రకటన విడుదల చేసింది.. నిర్బంధంలో ఉన్నన్ని రోజులు ఆయన కళ్లకు గంతలు కట్టి ఉంచారని, నిద్రపోనివ్వకుండా తీవ్రంగా ఇబ్బంది పెట్టారని తెలిపింది. అంతేకాకుండా పాక్ అధికారులు ఆయనను తరచూ మాటలతో దూషిస్తూ, మానసికంగా వేధించినట్లు పేర్కొంది. అలాగే మన దేశ రహస్యాల కోసం అతడిపై పలు రకాలుగా వత్తిళ్ళ తెచ్చారని పేర్కొంది.. అలాగే పూర్ణమ్ కుమార్ ను హింసించిన వారంతా సివిల్ డ్రస్ లో ఉన్నారని కూడా వెల్లడించింది.. బందీగా చిక్కిన సైనికుడు పట్ల పాక్ అమానుషంగా ప్రవర్తించిందని, దీనిపై పాక్ ను ప్రశ్నిస్తామని ఆర్మీ పేర్కొంది. సాధారణంగా యుద్ధ ఖైదీల విషయంలో కూడా అంతర్జాతీయ నిబంధనలను పాటించాల్సి ఉండగా పొరపాటున సరిహద్దు దాటిన జవాన్ పట్ల ఇంతటి కఠినంగా ప్రవర్తించడం గమనార్హం. ఈ ఘటనపై ఉన్నతాధికారులు తదుపరి చర్యలకు సిద్ధమవుతున్నారు.

## పహాల్గాం ఉగ్రదాడి ఘటన నేపథ్యంలో తిరుమలలో భద్రత మరింత బలోపేతం చేయాలి : రేంజ్ డీఐజీ



తిరుపతి , మే 15: తిరుమలలోనిఅన్నమయ్య భవన్‌లో గురువారం తిరుమల భద్రతపై ఉన్నతస్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశానికి పోలీసు శాఖ, టీటీడీ, ఇతర భద్రతా విభాగాల ఉన్నతాధికారులు హాజరయ్యారు. అనంతపురం రేంజ్ డీఐజీ డాక్టర్ షెమూషి అధ్యక్షతన జరిగిన సమావేశంలో పలు అంశాలపై చర్చ జరిగింది.

ఈ సందర్భంగా డీఐజీ మాట్లాడుతూ ఇటీవల పహల్గాం ఉగ్రదాడి ఘటన నేపథ్యంలో తిరుమల ఆలయంలో భద్రతనుమరింత బలోపేతం చేయడమే భద్రతా ఆడిట్ ఉద్దేశమని పేర్కొన్నారు. అన్ని భద్రతా దళాలు , టిటిడి విభాగాలు సమన్వయంతో పనిచేస్తూ, భక్తుల మనోభావాలను కాపాడటమే ప్రధాన లక్ష్యంగా ఉండాలన్నారు. టీటీడీ ఇన్‌ఛార్జి సీవీఎస్‌వో , తిరుపతి అర్బన్ ఎస్పీ హర్షవర్ధన్ రాజు 2023 మే నెలలో నిర్వహించిన భద్రతా ఆడిట్ సమీక్షలో చేసిన ప్రతిపాదనలు, ఇటీవల ఏర్పడిన పరిస్థితుల ఆధారంగా చేపట్టాల్సిన మార్పులు అనే విషయాలపై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా సుదీర్ఘనీగా వివరించారు.

ఏపీఎస్పీ, డీఏఆర్, ఎస్పీఎఫ్, హోం గార్డులు, సివిల్ పోలీసు, టీటీడీ భద్రతా సిబ్బంది వంటి అన్ని భద్రతా దళాలను సమన్వయ పరచి ప్రతి ఒక్క దళానికి స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్స్ రూపొందించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ప్రైవేట్ సెక్యూరిటీ సిబ్బంది సహా అన్ని యాక్సెస్ కంట్రోల్ బృందాలకు తగిన శిక్షణ ఇవ్వాల్సిన అవసరముందని అన్నారు. తలకోన, మామండూరు, తుంబురు తీర్థం, మంగళం మార్గాలు సహా శేషాచల అటవీ ప్రాంతానికి చెందిన 14 ప్రవేశ ద్వారాలలో భద్రతను మరింత పటిష్టం చేయాలని సూచించారు.

భద్రతా సిబ్బందికి రసాయన, జీవ, కిరణ, అణు ముప్పులపై శిక్షణ , యాంటీ సాబటేజ్ చర్యలు, మాక్ డ్రిల్లులు, ఎవాక్యుయేషన్ డ్రిల్లులు వంటి అంశాలపై శిక్షణలు ఇవ్వాలని సమావేశంలో నిర్ణయించారు. ఈ సమావేశంలో గ్రేహౌండ్స్ ఎస్పీ డాక్టర్ గరుడ్ సుమిత్ సునీల్, ఐఎస్‌డబ్ల్యూ ఎస్పీ అరిఫ్ హఫీజ్, తిరుపతి డీఎఫ్‌వో వివేక్ ఆనంద్, వివిధ భద్రతా దళ అధికారులు, టీటీడీ విజిలెన్స్, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.




# నిర్లక్ష్యం చేస్తే డెంగ్యూ వ్యాధి ప్రాణాంతకం కావచ్చు !

**(16 మే "జాతీయ డెంగ్యూ దినం" సందర్భంగా)**

రుతుపవనాలు ప్రారంభమయ్యే వర్షాకాలపై వేకువ జామున లేదా సాయంకాలం గడియల్లో వైరస్ సోకిన 'ఆడెస్ ఎజిప్టీ' వర్గపు దోమల కాటు వల్ల సంక్రమించే డెంగ్యూ వైరల్ నిర్లక్ష్యం చేస్తే ప్రమాదకరంగా, చివరకు ప్రాణాంతకంగా కూడా మారుతుంది. నాలుగు రకాల డెంగ్యూ వ్యాధుల కట్టడి చేయడానికి, దోమలు పెరగకుండా పరిసరాల పరిశుభ్రతను పాటించడమే ఏకైక ఉత్తమ మార్గం అని తెలుసుకోవాలి. డెంగ్యూ వ్యాధికి చికిత్స ఉన్నప్పటికీ అశ్రద్ధ చేస్తే ప్రమాదకరంగా మారి ప్రాణాలను కూడా తీస్తుందని పౌర సమాజం అర్థం చేసుకోవాలి. డెంగ్యూ వ్యాధి ముఖ్య లక్షణాల్లో అధిక జ్వరం, తీవ్ర తలనొప్పి, నేత్రాల వెనుక నొప్పి, కండరాలు/కీళ్ల నొప్పులు, వాంతులు, అలసట, ముక్కు/చిగుర్ల నుంచి రక్తం కారడం, శారీరక బలహీనత, చర్మంపై దద్దుర్లు, బిపీ తగ్గడం, ప్లేట్లెట్ల సంఖ్య పడిపోవడం, చివరకు అవయవాల నిక్రియత్వం లాంటివి కనిపిస్తాయి.

## జాతీయ డెంగ్యూ దినం-2025 ఇతివృత్తం:

ప్రమాదకర ప్రజారోగ్య సమస్యగా మారిన డెంగ్యూ వ్యాధి పట్ల ప్రజల్లో అవగాహన కల్పించటానికి ప్రతి ఏట మే 16న భారత దేశవ్యాప్తంగా "జాతీయ డెంగ్యూ దినం" లేదా "నేషనల్ డెంగ్యూ డే" పాటించడం ఆనవాయితీగా మారింది. ప్రభుత్వ వైద్య ఆరోగ్య యంత్రాంగం పాత్ర, వైద్య సిబ్బంది అంకితభావం, వ్యాధి పట్ల ప్రజలకు కనీస అవగాహన కల్పించడం, పరిసరాల పరిశుభ్రతకు పెద్ద పీట వేయడం, ప్రజారోగ్య వ్యవస్థలను బలోపేతం చేయడం, వర్షాకాలంలో తగు జాగ్రత్తలు తీసుకోవడానికి చర్యలు తీసుకోవడం, పౌర సమాజాన్ని ఏకీకరణ చేయడం లాంటి లక్ష్యాలను చేపట్టడానికి జాతీయ డెంగ్యూ దినం వేదికలను వినియోగించుకోవాలి. జాతీయ డెంగ్యూ దినం-2025 ఇతివృత్తంగా "ప్రారంభంలోనే చర్యలు,డెంగ్యూ నివారణ : పరిసరాల పరిశుభ్రత, ఆరోగ్యకర జీవన విధానం" అనబడే అంశాన్ని తీసుకొని ప్రచారం నిర్వహిస్తున్నారు.

## భారతంలో డెంగ్యూ వ్యాధి వ్యాప్తి:

భారత దేశవ్యాప్తంగా డెంగ్యూ కేసులు నమోదు అయినప్పటికీ యూపీ, గుజరాత్, మహారాష్ట్ర, కర్నాటక, పంజాబ్ లాంటి రాష్ట్రాల్లో డెంగ్యూ వ్యాప్తి అధికంగా కనిపిస్తున్నది. ముఖ్యంగా పట్టణాల ప్రజల నుంచి పల్లెలకు ఈ వ్యాధి వ్యాపించడం జరుగుతున్నది. 2023లో దేశవ్యాప్తంగా 2.9 లక్షల కేసులు నమోదు కాగా 485 మరణాలు కూడా జరిగాయి. అదే విధంగా 2024లో 2.33 లక్షల రోగులు, 236 మరణాలు డెంగ్యూ వల్ల జరిగాయని గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ఉష్ణోగ్రతలు పెరగడం, అకాల వర్షాలు కురవడం, ప్రజల్లోఅవగాహనలేమి, ప్రభుత్వాల చర్యలు మందగించడం లాంటి కారణాలతో డెంగ్యూ వ్యాప్తి పెరుగుతున్నది. ప్రణాళిక కొరవడిన పట్టణీకరణ కూడా డెంగ్యూ రెచ్చిపోవడానికి ఒక ప్రధాన కారణం అవుతున్నది.

జాతీయ డెంగ్యూ దినం వేదికగా ప్రజలు, ప్రభుత్వ యంత్రాంగాలు సమైక్యంగా పోరాడితే పలు అంటువ్యాధులు, సాంక్రమిక వ్యాధులకు అడ్డుకట్ట వేయవచ్చు. అస్తవ్యస్త పట్టణీకరణ, వాతావరణ ప్రతికూల మార్పులు, వర్షాకాల అపరిశుభ్రతలు డెంగ్యూ లాంటి సాంక్రమిక వ్యాధులకు తలుపులు తెరుస్తున్నట్లు అవుతున్నది. సరైన సమయంలో స్పందిస్తూ పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వడంతో పాటు పౌర సమాజ చైతన్యం తగు రీతిలో కొనసాగితే డెంగ్యూ వ్యాధి కట్టడి సులభం అవుతుంది. మన స్వల్ప అశ్రద్ధ ప్రాణాంతకం కావద్దు. మన ఇంటి పరిసరాల పరిశుభ్రత మన కుటుంబ/సమాజ ఆరోగ్య ప్రదాయిని అని తెలుసుకుందాం. వ్యాధి చికిత్స కన్న నివారణే మిన్న అనే నినాదాన్ని గుర్తుంచుకొని మన ఆరోగ్యం కోసం మనమే ప్రతినబూనుదాం, డెంగ్యూ కనబడని భారతాన్ని నిర్మించుకుందాం.

- డా॥బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

# మన గిరిజన సంస్కృతి ఆహ్లాదభరితం... మన ఆదివాసీ సంస్కృతే మన సంపద అని ప్రశంసించిన ఉపరాష్ట్రపతి

న్యూఢిల్లీ, మే 15:"ఒక వ్యక్తి జేబులను ఉచితాలతోనూ, ఇతరత్రా కానుకలతోనూ నింపడం నిజమైన సాధికారత కాదు. సిసలైన సాధికారత అంటే అతడు గాని లేదా ఆమె గాని స్వీయ సాధికారతను సాధించుకొనేటట్లు ఆ వ్యక్తికి మీరు చేదోడుగా నిలవడం. అది ఆ మనిషికి సంతోషాన్ని, సంతృప్తిని, అంతశ్శక్తిని ఇవ్వడమే కాకుండా మీ కుటుంబాలు మిమ్మల్ని చూసి గర్వపడేటట్లు కూడా చేస్తుంది" అని ఉపరాష్ట్రపతి శ్రీ జగ్‌దీప్ ధన్‌ఖడ్ ఈ రోజు అన్నారు.

మేఘాలయలో గారో హిల్స్, ఖాసీ హిల్స్, జైంతియా హిల్స్ ప్రాంతాలకు చెందిన స్వయంసహాయ బృందాల (ఎస్‌హెచ్‌జీ) సభ్యులను ఉద్దేశించి శ్రీ ధన్‌ఖడ్ న్యూఢిల్లీలో ఈ రోజు మాట్లాడారు. "మన దేశంలోని ఈశాన్య ప్రాంతం మనకు ఓ నగ లాంటిది. 90వ దశాబ్దంలో, అంటే ఇప్పటికి ముప్ఫయ్ ఏళ్ల కిందటి సంగతి... భారత ప్రభుత్వం ఒక విధానాన్ని అమలుపరిచింది. ఆ విధానమే 'లుక్ ఈస్ట్'. ఈ విధానానికి 'యాక్ట్ ఈస్ట్' అనే ఒక అదనపు పార్శ్వాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జోడించారు. మరి ఆ కోణం చాలా ప్రభావవంతంగా అమరింది. పర్యాటకులకు మేఘాలయ స్వర్గధామం అనే సంగతిని మీకు నేను చెప్పదలచుకున్నాను. ఇది ప్రకృతి ప్రసాదించిన ఒక గొప్ప కానుక" అని ఉపరాష్ట్రపతి అన్నారు.

'లుక్ ఈస్ట్, యాక్ట్ ఈస్ట్' విధానంలో భాగంగా జరిగిన ప్రగతిని ఉపరాష్ట్రపతి ప్రధానంగా వివరిస్తూ, మేఘాలయకు పర్యటన, గనుల తవ్వకం, ఐటీ, సేవల రంగాల్లో అపారమైన అవకాశాలు ఉన్నాయన్నారు. ఆర్థిక అభివృద్ధి, మహిళలకు సాధికారత కల్పన.. ఈ అంశాల్లో రాష్ట్రం సాధించిన విజయాలను ఆయన ప్రశంసించారు. దీనికి ఖ్యాతిని ఇవ్వాల్సింది కేంద్రంతో పాటు రాష్ట్ర స్థాయిలో దార్శనికత కనబరుస్తున్న నాయకత్వానికేనన్నారు.

పది సంవత్సరాలుగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో సాధించిన అభివృద్ధిని, పాలన సంస్కరణలను ఉపరాష్ట్రపతి ప్రశంసించారు. ఉపరాష్ట్రపతి ఇంకా ఇలా అన్నారు.."అధికారులు సరి అయిన దిశలో పనిచేసేటట్లుగా వారికి దార్శనిక నాయకత్వం ప్రేరణనిస్తుంది. అదృష్టవశాత్తు మన దేశంలో గత పదేళ్లుగా జరుగుతోంది ఇదే. మరి మీ రాష్ట్రంలోనూ ఇదే జరుగుతోంది. ప్రధాని మోదీ దార్శనిక నాయకత్వంలో ఆర్థిక రంగం, మౌలిక సదుపాయాల కల్పన, సాంకేతికత, మహిళల అభ్యున్నతి, మహిళా సాధికారత వంటి రంగాలలో గత దశాబ్ద కాలంలో దేశం సాధించిన విజయాలు ప్రపంచానికి అసూయ కలిగిస్తున్నాయి. మన గిరిజన సంస్కృతి ఆహ్లాదభరితంగా ఉంది. మన ఆదివాసీ సంస్కృతి మన సంపద."

రాష్ట్రం సాధించిన ఆర్థిక పురోగతిని ఉపరాష్ట్రపతి ప్రశంసిస్తూ ఇలా అన్నారు.."ఒక రాష్ట్రం ఆర్థికవ్యవస్థను జీఎస్‌డీపీ (గ్రాస్ స్టేట్ డొమెస్టిక్ ప్రోడక్ట్)తో నిర్ధారిస్తారు. మరి ఈ విషయంలో మేఘాలయ రాష్ట్రం 13 శాతం అభివృద్ధిని సాధించింది. ఏటికేడాది 13 శాతం ఉన్నతి అంటే అది చాలా చాలా ప్రశంసనీయం. రాష్ట్ర ఆర్థిక అభివృద్ధిని మెరుగుపరచాలని గొప్ప నిబద్ధతను కనబరచిన ముఖ్యమంత్రికి అభినందనలు. ప్రస్తుతానికి, ఇది రూ.66,000 కోట్లకు పైబడుతుందన్న అంచనా ఉంది. మేఘాలయ మనస్సు విషయానికి వస్తే ఒక పెద్ద రాష్ట్రం. అయితే భౌగోళికంగా అంత పెద్దదేంకాదు. కానీ మీ ఆర్థిక వ్యవస్థ పరిమాణం చక్కగా ఉంది. మీరు ఒక గొప్ప లక్ష్యాన్ని పెట్టుకున్నారు. 2028 కల్లా రాష్ట్రం 10 బిలియన్ డాలర్ల విలువ గల ఆర్థిక వ్యవస్థగా మారాలి అనేది మీ లక్ష్యంగా ఉంది."

వృద్ధి ఫలాలను సమాజంలో అన్ని వర్గాల వారికి అందించడం ముఖ్యమని ఉపరాష్ట్రపతి చెబుతూ, "రాష్ట్రంలో ప్రతిభావంతులు ఎంతోమంది ఉన్నారు... పర్యటన రంగం, ఐటీ, సేవ... ఇలా పలు రంగాల్లో అనంత అవకాశాలు ఉన్నాయి. అయితే అంతకంటే ముఖ్యమైంది మానవ శక్తిని తీర్చిదిద్దుకోవడం. మానవ వనరులు స్వతంత్రంగా ఉండితీరాలి. ఈ కేటగిరీలో కూడా, సామాజిక ప్రగతి, ఆర్థిక అభివృద్ధి.. ఇవి ఎప్పుడు సమతుల్యంగా ఉంటాయంటే, అది... మహిళలు ముందుకు వచ్చినప్పుడే. రివాల్వింగ్ ఫండ్ పరంగా చూసినా, సంఖ్య పరంగా చూసినా ఈ రెండు కోణాల్లో పదింతల పెరుగుదల చోటుచేసుకోవడాన్ని గమనిస్తే నాకు ఎంత సంతోషంగా ఉందో చెప్పలేను" అన్నారు. ఈ సమావేశంలో మేఘాలయ ముఖ్యమంత్రి శ్రీ కాన్‌రాడ్ సంగ్మాతోపాటు ఇతర ఉన్నతాధికారులు కూడా పాల్గొన్నారు.

# సరస్వతీ పుష్కరాల్లో మీడియాకు కష్టాలు

**-మీడిసెంటర్ కు రూమ్ కేటాయించని వైనం**

**ఇబ్బందులు పడుతున్న ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు**

కాళేశ్వరం, మే 15: దక్షిణ అరణ్య శైవక్షేత్రంగా పేరుగాంచిన శ్రీ కాళేశ్వర ముక్తేశ్వర స్వామి దేవస్థానం వద్ద గురువారం నుండి ప్రారంభమైన పుష్కరాల సందర్భంగా.. సిఎం పర్యటన వార్తల కవరేజ్ కి వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులకు కష్టాలు తప్పడం లేదు. ఆలయ ఈవో, జిల్లా అధికారులు మీడియాపై చిన్నచూపు చూడడంతోనే ఈ దుస్థితి ఏర్పడిందని మీడియా మిత్రులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

సరస్వతి పుస్కారాలు 12 రోజుల పాటు విధులు నిర్వహించాల్సిన మీడియాపై ఇంత నిర్లక్ష్య ధోరణి ప్రదర్శిస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఆలయం సమీపంలో మీడియా సెంటర్ ఏర్పాటు చేసి తగిన వసతులు కల్పించాల్సి ఉండగా అవేమి పట్టించుకోకుండా కేవలం సేవ భక్తులకు ఇచ్చిన రూమ్ కే మీడియా సెంటర్ అని బోర్డు తగిలించి అధికారులు చేతులు దులుపుకున్నారు. దీంతో కాళేశ్వరంకు వచ్చిన మీడియా వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

# సరదా కోసం.. ఈతకు వెళ్లిన యువకుడి మృతి



అమరావతి, మే 15:వ్యవసాయ బావిలో సరదగా ఈత కొట్టేందుకు స్నేహితులతో కలిసి వెళ్లిన ఓ యువకుడు గల్లంతు కాగా, మృతదేహం గురువారం లభ్యమైంది. వివరాల్లోకి వెళితే.. గోదావరిఖనిలోని జై భీమ్ నగర్‌కు చెందిన ముస్కే రాజీవ్ గాంధీ (35) బుధవారం తన స్నేహితులతో కలిసి ఎలిగేడు మండలం ముప్పిరి తోట గ్రామంలో జరిగిన శ్రీ వెంకటేశ్వర స్వామి రథోత్సవ జాతరకు వచ్చారు. అనంతరం సరదాగా ఈత కొట్టేందుకు స్నేహితులతో కలిసి సాయంత్రం వ్యవసాయ బావిలోకి దిగారు. గాంధీకి ఈత రాకపోవడంతో బావిలో గల్లంతయ్యాడు.

వెంటనే స్నేహితులు బంధువులకు, స్థానికులకు సమాచారం అందించడంతో బావిలో గాంధీ ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. గురువారం జూలపల్లి పోలీసులు, పెద్దపల్లి, గోదావరిఖని చెందిన రెస్క్యూ టీంతో వెతికించి మృతదేహాన్ని బయటకు తీశారు. మృతుడు సింగరేణిలో కాంట్రాక్ట్ ప్రాతిపదికన ఉద్యోగం చేస్తున్నాడు. మృతుడికి తల్లి, అక్క, చెల్లి ఉన్నారు. గతంలోనే తండ్రి చనిపోయినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. తల్లి రాజేశ్వరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు జూలపల్లి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# నిజాంసాగర్ ప్రాజెక్టులో దూకి తల్లి కొడుకు ఆత్మహత్య..



హైదరాబాద్, మే 15:మండలంలోని నిజాంసాగర్ ప్రాజెక్టులో తల్లి కొడుకులు దూకి ఆత్మహత్య చేసుకున్న సంఘటన గురువారం వెలుగులోకి వచ్చింది. స్థానిక ఎస్సై శివకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. సంగారెడ్డి జిల్లా నిజాంపేట్ మండలం మునిగేపల్లి గ్రామానికి చెందిన దార ప్రమీల (30), దార అక్షయ్ (8) అనే తల్లి కొడుకులు నిజాంపేట్ మండల కేంద్రంలోని బ్యాంకుకు వెళ్లి వస్తామని ఇంట్లో చెప్పి నిజాంసాగర్ ప్రాజెక్టులోకి వచ్చి ప్రాజెక్టు 20గేట్ల గోలి వద్ద నీటిలోకి దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. గురువారం ఉదయం ప్రమీల, అక్షయ్ ల మృతదేహాలు నిజాంసాగర్ ప్రాజెక్టులో చేపలు పట్టే వారికి కనిపించడంతో పోలీసులకు సమాచారం అందించారు.

దీంతో ఎస్ఐ శివకుమార్ పోలీస్ సిబ్బందితో ఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాలను ఒడ్డుకు తీయించి నిజాంపేట్ మండలం మునిగేపల్లి గ్రామానికి చెందిన దార ప్రమీల, అక్షయ్ లుగా గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. దార ప్రమీల భర్త దార సాయిలు గత 20రోజుల క్రితం అప్పుల బాధతో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడని, దీంతో తీవ్ర మనస్థాపానికి గురైన ప్రమీల జీవితంపై విరక్తి చెందిందని, ప్రమీలకు 12 సంవత్సరాల కూతురు నిహారిక, 8 సంవత్సరాల కుమారుడు అక్షయ్ లు ఉండగా తన కుమారుడు అక్షయ్ తో కలిసి ప్రాజెక్టుకు వచ్చి ప్రాజెక్టులో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. మృతుల కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు, పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను బాన్సువాడ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు ఎస్సై శివ కుమార్ తెలిపారు.

# టీబీ నిర్మూలనలో పరిశుభ్రత ప్రాముఖ్యతను స్పష్టం చేసిన ప్రధానమంత్రి

న్యూఢిల్లీ, మే 15:జాతీయ క్షయ నిర్మూలన కార్యక్రమం (ఎన్‌టిఇపి) గురించి ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ అధ్యక్షతన ఈరోజు ఉదయం న్యూఢిల్లీలోని 7, లోక్ కళ్యాణ్ మార్గ్‌లో గల ఆయన నివాసంలో ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు.

2024లో టీబీ రోగులను ముందుగానే గుర్తించడం ద్వారా చికిత్సలో గణనీయమైన పురోగతి సాధ్యపడిందని ప్రశంసించిన ప్రధానమంత్రి... దేశవ్యాప్తంగా విజయవంతమైన ఈ వ్యూహాలను అమలు చేయాలని పిలుపునిచ్చారు. టీబీ నిర్మూలన పట్ల భారతదేశ నిబద్ధతను ఆయన పునరుద్ఘాటించారు.

ఇటీవల ముగిసిన 100 రోజుల టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమం గురించి ప్రధానమంత్రి సమీక్ష నిర్వహిచారు. ఈ కార్యక్రమంలో భాగంగా 12.97 కోట్ల మంది టీబీ ముప్పు గల వ్యక్తులకు పరీక్షలు నిర్వహించి, 7.19 లక్షల మందిలో టీబీ వ్యాధిగ్రస్థులను గుర్తించారు. వీటిలో 2.85 లక్షల మందిలో ఎలాంటి లక్షణాలు లేకుండానే టీబీ నిర్ధారణ అయింది. ఈ ప్రచారంలో భాగంగా ఒక లక్షకు పైగా కొత్త ని-క్షయ్ మిత్రాలు ఈ ప్రయత్నంలో భాగస్వాములయ్యారు. ఇది దేశవ్యాప్తంగా యావత్ ప్రభుత్వ, యావత్ సమాజ విధానాన్ని వేగవంతం చేసి, ఈ కార్యక్రమాన్ని మరింత విస్తరించడానికి విలు కల్పించే జన్ భాగీదారి కోసం ఒక నమూనాగా నిలిచింది.

పట్టణ.. గ్రామీణ ప్రాంతాల ఆధారంగా, అలాగే వారి జీవనోపాధి ఆధారంగా కూడా టీబీ రోగుల ధోరణులను విశ్లేషించాల్సిన అవసరం ఉందని ప్రధానమంత్రి స్పష్టం చేశారు. ఇది ముఖ్యంగా నిర్మాణం, మైనింగ్, టెక్స్‌టైల్ మిల్లుల వంటి రంగాల్లోని కార్మికుల్లో ముందస్తు పరీక్షలు, చికిత్స అవసరమయ్యే సమూహాలను గుర్తించడంలో సహాయపడుతుందన్నారు. ఆరోగ్య సంరక్షణ రంగంలో సాంకేతికత మెరుగవుతున్న క్రమంలో, నిక్షయ్ మిత్రాలు (టీబీ రోగుల సహాయకులు) టీబీ రోగులతో అనుసంధానం అయ్యేందుకు సాంకేతికతను ఉపయోగించుకునేలా ప్రోత్సహించాలని సూచించారు. సంభాషణల ద్వారా, సులభంగా ఉపయోగించగల సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి రోగులకు వ్యాధిని గురించి, దాని చికిత్సను గురించి అవగాహన కలిగించాలని ప్రధానమంత్రి సూచించారు.

క్రమం తప్పకుండా తీసుకునే చికిత్సతో ఇప్పుడు టీబీని పూర్తిగా నయం చేయగలగడం వల్ల, ప్రజల్లో దీని గురించి భయాన్ని తగ్గించి, అవగాహనను పెంచాలని ప్రధానమంత్రి కోరారు. టీబీ నిర్మూలనలో జన్ భాగీదారీ ద్వారా పరిశుభ్రత ప్రాముఖ్యతను వివరించడం కీలకమైన చర్యగా ప్రధానమంత్రి పేర్కొన్నారు. ప్రతి రోగికి సరైన చికిత్స లభించేలా వ్యక్తిగతంగా వారిని సంప్రదించే ప్రయత్నాలు జరగాలని ఆయన కోరారు.

డబ్ల్యుహెచ్ఓ గ్లోబల్ టీబీ రిపోర్ట్ 2024 వెల్లడించిన ప్రోత్సాహకరమైన ఫలితాలను ఈ సమావేశంలో ప్రధానమంత్రి ప్రస్తావించారు. టీబీ వ్యాప్తి 18 శాతం తగ్గిందని (2015 నుంచి 2023 మధ్య కాలంలో టీబీ సోకిన రోగుల 237 నుంచి 195 లక్షలకు తగ్గింది) ఈ నివేదిక ధ్రువీకరించింది. దీని ప్రకారం ప్రపంచవ్యాప్తంగా కంటే భారత్‌లో టీబీ కేసుల తగ్గుదల వేగం రెట్టింపుస్థాయిలో ఉంది. అలాగే టీబీ మరణాల్లో సైతం 21 శాతం తగ్గుదల (లక్ష జనాభాకు 28 నుంచి 22 కి), 85 శాతం చికిత్స కవరేజ్, భారత్‌లో ఈ కార్యక్రమ పరిధి విస్తరణను, దాని ప్రభావాన్ని ప్రతిబింబిస్తున్నాయి.

కీలక మౌలిక వసతులను మెరుగుపరచడం గురించి ప్రధానమంత్రి సమీక్షించారు. టీబీ రోగనిర్ధారణ కేంద్రాల నెట్‌వర్క్‌ను 8,540 ఎన్ఏఏటి (న్యూక్లియిక్ యాసిడ్ యాంప్లిఫికేషన్ టెస్టింగ్) ల్యాబ్‌లు, 87 కల్చర్- డ్రగ్ ససెప్టిబిలిటీ ల్యాబ్‌లకు విస్తరించడం, 500 ఏఐ- ఆధారిత హ్యాండ్‌హెల్డ్ ఎక్స్-రే పరికరాలు సహా 26,700 కి పైగా ఎక్స్-రే యూనిట్లు ఏర్పాటు చేయడం, అలాగే మరో 1,000 యూనిట్ల ఏర్పాటుకు ప్రణాళిక చేయడం వంటి పనులు ఇందులో భాగంగా ఉన్నాయి. ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లలో ఉచిత స్క్రీనింగ్, రోగ నిర్ధారణ, చికిత్స, పోషకాహారం అందించడం సహా అన్ని రకాల టీబీ సేవల వికేంద్రీకరణ గురించి ప్రధానమంత్రి వివరించారు.

స్క్రీనింగ్ కోసం ఏఐ ఆధారిత హ్యాండ్-హెల్డ్ ఎక్స్-రేలు, డ్రగ్ రెసిస్టెంట్ టీబీ కోసం స్వల్పకాలిక చికిత్సా విధానం, కొత్త స్వదేశీ మాలిక్యులర్ డయాగ్నస్టిక్స్, పోషకాహారం అందించడం, అలాగే గనులు, టీ తోటలు, నిర్మాణ ప్రదేశాలు, పట్టణప్రాంతంలోని మురికివాడల వంటి ప్రదేశాల్లో పనిచేసే వారిలో వ్యాధిని ముందస్తుగా గుర్తించడం కోసం స్క్రీనింగ్ నిర్వహణ వంటి అనేక కొత్త కార్యక్రమాలను ప్రారంభించినట్లు ప్రధానమంత్రి వివరించారు. వీటిలో పోషకాహార కార్యక్రమాలు కూడా భాగంగా ఉన్నాయి. 2018 నుంచి 1.28 కోట్ల టీబీ రోగులకు ని-క్షయ్ పోషణ్ యోజన ద్వారా డిబిటి చెల్లింపులు చేయడంతో పాటు, 2024లో ఆ ప్రోత్సాహకాన్ని రూ. 1,000 కు పెంచడం జరిగిందన్నారు. ని-క్షయ్ మిత్ర కార్యక్రమం కింద, 2.55 లక్షల ని-క్షయ్ మిత్రాలు 29.4 లక్షల ఫుడ్ బాస్కెట్లను పంపిణీ చేసినట్లు ప్రధానమంత్రి తెలిపారు.


**ఆహ్వానము**

తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ
భవానీ సాహిత్య వేదిక -కరీంనగర్
సంయుక్త ఆధ్వర్యంలో...
వైరాగ్యం ప్రభాకర్ సంపాదకత్వంలో వెలువడిన
పహల్గాం, హాస్యవల్లరి మరియు గద్వాల సోమన్న గారి సప్తతి
పుస్తకాల ఆవిష్కరణ సభ

తేది : 16.05.2025 శుక్రవారం ఉ॥ 9.00 గంటలకు
వేదిక : రవీంద్రభారతి (మొదటి అంతస్తు), హైదరాబాద్.

సభాధ్యక్షులు :
డా. వైరాగ్యం ప్రభాకర్ గారు
కవి, రచయిత, విమర్శకులు, శతాధిక గ్రంథ ప్రచురణకర్త
ముఖ్య అతిథి & పుస్తకావిష్కర్త :
ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు గారు
తెలుగు శాఖ పూర్వ అధ్యక్షులు, హైదరాబాద్ విశ్వవిద్యాలయం
విశిష్ట అతిథులు :
డా. మామిడి హరికృష్ణ గారు
సంచాలకులు, భాషా సాంస్కృతిక శాఖ తెలంగాణ
డా. నామోజు బాలాచారి గారు
తెలంగాణ సాహిత్య అకాడమీ ప్రధాన కార్యదర్శి
డా. కాంచనపల్లి గోవర్ధన్‌రాజు గారు
విజిటింగ్ ప్రొఫెసర్, సు.ప్ర.తె.వి.విద్యాలయం
గౌరవ అతిథులు :
డా. కాచం సత్యనారాయణ గారు, విశ్వంభర పత్రిక సంపాదకులు
శ్రీ పాణ్యం దత్తశర్మ గారు, ప్రముఖ కవి, ప్రవచనకర్త, కాలమిస్ట్
ఆత్మీయ అతిథులు :
శ్రీ చౌడూరి నరసింహారావు గారు, ప్రముఖ కవి, చౌడూరి కళాపీఠం వ్యవస్థాపక అధ్యక్షులు
శ్రీ గద్వాల సోమన్న గారు, బాల సాహితీవేత్త

ఆహ్వానించువారు :
గంప ఉమాపతి
ప్రముఖ కవి

అందరూ ఆహ్వానితులే !


# గోదావరిఖనిలో సింగరేణి ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా

హైదరాబాద్, మే 15: సింగరేణి ప్రాంత నిరుద్యోగ యువతకు వివిధ ప్రైవేట్ కంపెనీలలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడం కోసం రామగుండం 1 ఏరియా గోదావరి ఖని లో వచ్చే ఆదివారంన సింగరేణి ఆధ్వర్యంలో మెగా ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు సింగరేణి చైర్మన్ ,ఎండీ ఎన్. బలరామ్ గురువారం ఒక ప్రకటనలో తెలియజేశారు.

ఈ మెగా జాబ్ మేళాలో హైదరాబాద్ ప్రాంతానికి చెందిన సుమారు 100 ప్రైవేటు సంస్థల లో వివిధ విభాగాల్లో 3 వేల ఖాళీలు భర్తీ కోసం ఎంపిక జరుగుతుందన్నారు . నిరుద్యోగ యువత హైదరాబాద్ లాంటి నగరాలకు వెళ్లి ఉద్యోగాల కోసం ప్రయత్నాలు చేయడం వ్యయ ప్రయాసలతో కూడుకుని ఉంటోందని, ఈ నేపథ్యంలో పలు కంపెనీల ప్రతినిధులతో మాట్లాడి స్థానికంగా ఉద్యోగ మేళాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. దీనిని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

ఇటువంటి జాబ్ మేళాలు ఇకపై ఇతర ఏరియాలలో కూడా నిర్వహించడం జరుగుతుందన్నారు. సింగరేణి సంస్థ లో ఉద్యోగ నియామకాలతో పాటు, నిరుద్యోగ యువత అందరికీ ఏదో ఒక ఉపాధి లేదా ఉద్యోగం కల్పించడం కోసం ఈ తరహా కార్యక్రమాలను సింగరేణి సంస్థ స్వచ్ఛందంగా చేపడుతుందని , ఈ అవకాశాలను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సింగరేణి సంస్థ సింగరేణి ప్రాంత నిరుద్యోగ యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించడం కోసం స్కిల్ డెవలప్మెంట్ సెంటర్లను ఇప్పటికే మందమర్రి, రామగుండం-1, భూపాలపల్లి ఏరియాలలో ప్రారంభించామని ఇతర ఏరియాలలో కూడా త్వరలో ప్రారంభిస్తున్నామన్నారు. యువతలో నైపుణ్యాలు పెంచడమే కాకుండా వారికి ఉద్యోగ అవకాశాలను కల్పించేందుకు వీలుగా జాబ్ మేళాలను కూడా ఏర్పాటు చేయిస్తున్నట్లు వివరించారు.

# ఘనంగా కోటి లింగార్చన మహోత్సవం

హైద్రాబాద్ మే 15 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); బోడుప్పల్ శివాలయములో శ్రీ వాసుదేవ సత్సంగ్ వ్యవస్థాపక అధ్యక్షులు లక్ష్మి సౌభాగ్యవతి శారద రాజేశ్వర్ దంపతుల ఆధ్వర్యంలో మానస మారయ్య దంపతుల సహకారము తో కోటి పార్థివలింగార్చన మహోత్సవము అత్యంత వైభవముగా జరిగినది . ముందుగా దీపారాధన, కలశస్థాపన ,గణపతి ,గౌరీపూజ ,నవగ్రహ ఆరాధన ,మరియు భక్తులు పుట్టమన్ను చేత 108 పార్థివ లింగములు చేసి ఆ శివలింగాలకు పంచామృత అభిషేకము రుద్రాభిషేకము, భస్మార్చన ,పుష్పార్చన ,బిల్వార్చన, ధూప దీప నైవేద్యములతో పూజ చేసిరి. శ్రీ వాగ్దేవి సంస్కృత భారతి మరియు బాసర శివయోగి నిర్మల అంబయ్య సిద్ధాంతి సిద్ధా శ్రమ వ్యవస్థాపక అధ్యక్షులు శివ శ్రీ నిర్మల అంబికానాథ శర్మ మాట్లాడుతూ బాసర క్షేత్రంలో 12 జ్యోతిర్లింగాల దేవాలయం ఈశాన్య భాగమున కోటి పార్థివలింగ స్తూపము నిర్మించినామని అందులో కోటి (పార్థివ)శివలింగములను స్థాపన చేయ దలచినామని , కోటిలో 90 లక్షల శివలింగాలను భక్తులతో చేయించడం, స్థాపన చేయడము జరిగినదని ,ఇంకా 10 లక్షలు లింగాలు చేయవలసి ఉన్నదని మరియు ఆసక్తి గల మహిళా బృందం వారు 9948332032 సంప్రదించి వారి వివరాలు తెలిపినచో పుట్టమన్ను ఉచితముగా ఇచ్చి మీతో శివలింగాలు మరియు పూజ కార్యక్రమాలు చేయించి అట్టి లింగములను కోటి పార్థివలింగ స్తూపం యందు నిక్షిప్తం చేయబడును అని శర్మతెలిపినారు..

# ఇక ఏటా సెప్టెంబరు 23న ఆయుర్వేద దినోత్సవం

న్యూఢిల్లీ, మే 15:ప్రపంచ స్థాయిలో వ్యాప్తిని పెంచడంతో పాటు నిర్వహణ తీరులో కచ్చితత్వాన్ని ప్రోత్సహించాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ఒక చరిత్రాత్మక నిర్ణయాన్ని తీసుకుంది... సెప్టెంబరు 23ను ప్రతి ఏటా ఆయుర్వేద దినోత్సవంగా నిర్వహించుకోవాలని నిర్ధారించింది. ఈ ఏడాది మార్చి నెల 23న జారీ చేసిన ఒక గెజిట్ నోటిఫికేషన్‌లో ఈ మార్పును సూచించి, అమలులోకి తీసుకువచ్చారు. ఆయుర్వేద దినోత్సవాన్ని ఇంతకుముందు 'ధన్‌తేరస్' నాడు జరుపుకొంటూ వచ్చారు. ధన్‌తేరస్ తారీఖు చంద్రమాన క్యాలెండరును అనుసరించి మారుతూ ఉంటుంది కాబట్టి, ఈ నిర్ణయాన్ని ఒక ముఖ్యమైన మార్పుగా చెప్పుకోవాలి.

శాస్త్రీయమైన, రుజువులపై ఆధారపడిన, సమగ్రమైన వైద్య చికిత్స పద్ధతిగా ఆయుర్వేదాన్ని ప్రోత్సహించడానికి ప్రతి సంవత్సరం ఆయుర్వేద దినోత్సవాన్ని పాటిస్తూ వస్తున్నారు. నివారణ ప్రధానమైన ఆరోగ్య సంరక్షణ, వెల్‌నెస్.. ఈ రెండు విషయాల్లో ఆయుర్వేద వైద్య చికిత్స పద్ధతి ఓ కీలక పాత్రను పోషిస్తోంది. ఇప్పటి వరకు, ఆయుర్వేద దినోత్సవాన్ని ధన్‌తేరస్‌తో పాటే జరిపేవారు. ఇది హిందూ నెల కార్తికంలో (సాధారణంగా అక్టోబరు లేదా నవంబరులో) వస్తుంది. ఏమైనా, ధన్‌తేరస్ తేదీ ప్రతి ఏడాదిలోనూ మారుతూ వచ్చేది.

ఈ కారణంగా ఆయుర్వేద దినోత్సవం ఏ రోజున అనే అంశం ఖాయంగా ఉండడం లేదు.

రాబోయే పది సంవత్సరాల్లో ధన్‌తేరస్ తేదీ అక్టోబరు 15 మొదలు నవంబరు 12 మధ్య చాలా మార్పులకు లోనవబోతోందని, దీంతో జాతీయ స్థాయిలోనూ, అంతర్జాతీయ స్థాయిలోనూ నిర్వహణ సంబంధిత ఏర్పాట్లలో తార్కిక సవాళ్లు తప్పేలా లేవన్న సంగతిని కూడా ఆయుష్ మంత్రిత్వ శాఖ పరిగణనలోకి తీసుకుంది. ఈ పరస్పర వైరుధ్యాన్ని పరిష్కరించడానికి, జాతీయ- అంతర్జాతీయ ఉత్సవాలకు ఒక నిలకడతనం కలిగిన సందర్భాన్ని ఖరారు చేయడానికి తగిన సమంజసపూరిత ప్రత్యామ్నాయాలను పరిశీలించేందుకు ఆయుష్ మంత్రిత్వ శాఖ ఒక కమిటీని వేసింది. నిపుణుల బృందం నాలుగు తేదీలను ప్రతిపాదించింది. వాటిలో సెప్టెంబరు 23 మిగతా అన్నింటిలోకీ చక్కని ఎంపికగా ఉంది. ఆచరణ సాధ్యంగా ఉండడం, ప్రతీకాత్మక కోణం.. ఈ రెండు అంశాలను గమనించిన తరువాత ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు.

ఎంపిక చేసిన సెప్టెంబరు 23 శరద్ రుతువులో సూర్యుడు భూమధ్య రేఖను దాటే సందర్భం... పగలు-రాత్రి దాదాపు సమంగా ఉండే (ఈక్వినాక్స్) రోజు ఇది. ఖగోళంలో చోటు చేసుకొనే ఈ ఘటన ప్రకృతిలో సమతుల్యతకు ప్రతీక. ఇది ఆయుర్వేద తత్వ దర్శనంతో చక్కగా సరిపోలుతోంది. మనసు, శరీరం, ఆత్మ.. వీటి మధ్య సమతౌల్యాన్ని ఏర్పరచుకోవాలని ఆయుర్వేదం స్పష్టం చేస్తోంది., విశ్వంలో పొందికకు నిదర్శనంగా నిలిచే ఈక్వినాక్స్ ఆయుర్వేద సారాన్ని చాటిచెబుతోంది. ప్రకృతితో సమతూకాన్ని ఏర్పరుచుకొని మనిషి తన మనుగడ సాగించాలి... ఆయుర్వేదలో ముఖ్యాంశమూ ఇదే.కొత్తగా నిర్ధారించిన తారీఖును వ్యక్తులు, ఆరోగ్య రంగాన్ని వృత్తిగా ఎంపిక చేసుకున్న నిపుణులు, విద్యాబోధన సంస్థలు, అంతర్జాతీయ భాగస్వాములు స్వీకరించి, ఏటా సెప్టెంబరు 23న నిర్వహించే ఆయుర్వేద దినోత్సవ కార్యక్రమాలలో చురుకుగా పాలుపంచుకోవాల్సిందిగా ఆయుష్ మంత్రిత్వ శాఖ విజ్ఞప్తి చేస్తోంది.

# వైమానిక యోధులు, సైనికులతో మాట్లాడాను.. దేశ రక్షణలో వారి ధైర్యసాహసాలు, నైపుణ్యం ప్రశంసనీయం

న్యూఢిల్లీ, మే 15:ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ అదంపూర్‌లోని వైమానిక దళ కేంద్రాన్ని సందర్శించి ధీరులైన వైమానిక యోధులు, సైనికులతో సంభాషించారు. వారితో మాట్లాడుతూ.. 'భారత్ మాతా కీ జై' నినాదం ఎంత శక్తిమంతమైనదో ఇప్పుడు ప్రపంచమంతటికీ తెలిసిందన్నారు. ఇది కేవలం ఒక నినాదం మాత్రమే కాదని, భరతమాత గౌరవ ప్రతిష్ఠలను నిలబెట్టడం కోసం ప్రాణం పణంగా పెట్టే ప్రతి సైనికుడూ చేసే శపథమని వ్యాఖ్యానించారు. ఈ నినాదం దేశం కోసం జీవించి అర్థవంతమైన సేవలందించాలనుకునే ప్రతీ పౌరుడి గొంతుక అని స్పష్టం చేశారు. యుద్ధభూమిలోను, కీలకమైన పోరాటంలోనూ 'భారత్ మాతా కీ జై' ప్రతిధ్వనిస్తుందన్నారు. భారత సైనికులు 'భారత్ మాతా కీ జై' అని నినదిస్తే శత్రువుల వెన్నులో వణుకు పుడుతుందన్నారు. భారత డ్రోన్లు శత్రు కోటలను కూల్చేసినప్పుడు, క్షిపణులు కచ్చితత్వంతో దాడి చేసినప్పుడు శత్రువుకు వినిపించే ఒకే నినాదం 'భారత్ మాతా కీ జై' అంటూ భారత సైనిక పాటవాన్ని కొనియాడారు. భారత్ అజేయ స్ఫూర్తిని శత్రువుకు చూపేలా- అత్యంత చీకటి రాత్రుల్లోనూ ఆకాశాన్ని దేదీప్యం చేయగల సమర్థత మన దేశానికి ఉన్నదని ప్రధానమంత్రి శ్రీ మోదీ స్పష్టం చేశారు. అణ్వస్త్ర బెదిరింపుల ముప్పులన్నింటినీ భారత బలగాలు నిర్మూలించిన వేళ భూమ్యాకాశాలంతటా ప్రతిధ్వనించే సందేశం ? 'భారత్ మాతాకీ జై' అని ఆయన ప్రకటించారు.

లక్షలాది భారతీయ హృదయాలను గర్వంతో నింపిన భారత సాయుధ దళాల ధైర్యాన్ని, దృఢ సంకల్పాన్ని ప్రశంసిస్తూ.. వారి అసమాన ధైర్యం, చారిత్రాత్మక విజయాలు ప్రతీ భారతీయుడినీ నేడు తలెత్తుకుని నిలిచేలా చేశాయని శ్రీ మోదీ వ్యాఖ్యానించారు. వీరులను కలుసుకోవడం గొప్ప అదృష్టంగా భావిస్తున్నానన్నారు. ఇకనుంచి దశాబ్దాలపాటు దేశం ఈ వీరత్వాన్ని కీర్తిస్తుందని, ఈ మిషన్‌లో ముందున్న సైనికులు గొప్పవారిగా నిలుస్తారని వ్యాఖ్యానించారు. ప్రస్తుత తరానికే కాకుండా, భవిష్యత్ తరాలకూ వారు ప్రేరణగా నిలిచారని వ్యాఖ్యానించారు. సాహసికులైన యోధుల గడ్డపైనుంచి సాయుధ దళాలనుద్దేశించి ప్రసంగించిన ఆయన.. పరాక్రమవంతులైన వైమానిక, నావికా దళాలు, సైన్యం, సరిహద్దు భద్రతా దళాల (బీఎస్ఎఫ్) సిబ్బందికి సెల్యూట్ చేశారు. ఆపరేషన్ సిందూర్ ప్రభావం దేశవ్యాప్తంగా ప్రతిధ్వనిస్తోందంటూ వారి వీరోచిత కృషిని ప్రశంసించారు. ప్రార్థనలు చేస్తూ, తిరుగులేని విధంగా మద్దతిస్తూ ప్రతి భారతీయుడూ ఈ ఆపరేషన్ సమయంలో సైనికులతో దృఢంగా నిలిచాడని ప్రధానమంత్రి చెప్పారు. సైనికుల త్యాగాలను కీర్తిస్తూ.. దేశ సైనికులు, వారి కుటుంబాలకు యావద్దేశం తరఫున మనఃపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

"ఆపరేషన్ సిందూర్ సాధారణ సైనిక కార్యక్రమం కాదు. భారత విధానం, లక్ష్యం, నిర్ణయాత్మక సామర్థ్యాల సమ్మేళనం'' అని ప్రధానమంత్రి స్పష్టం చేశారు. బుద్ధుడూ, గురు గోవింద్ సింగ్ ఇద్దరికీ భారత్ నిలయమని పేర్కొన్నారు. "ఒక యోధుడు 125,000 మందితో పోరాడేలా నేను తయారు చేస్తాను, డేగలను ఓడించేలా పిచ్చుకలను తీర్చిదిద్దుతాను.. అప్పుడే నన్ను గురు గోవింద్ సింగ్ అని పిలవండి" అన్న గురుగోవింద్ సింగ్ ప్రకటనను శ్రీ మోదీ గుర్తు చేశారు. ధర్మస్థాపన కోసం అన్యాయానికి వ్యతిరేకంగా ఆయుధాన్ని ప్రయోగించడం భారత సంప్రదాయమని వ్యాఖ్యానించారు. భరతమాత బిడ్డలపై దాడి చేసి, హాని తలపెట్ట సాహసించిన ఉగ్రవాదులను భారత బలగాలు వారి స్థావరాల్లోనే అణచివేశాయన్నారు. పరాక్రమశీలురైన భారత సాయుధ బలగాలను సవాలు చేస్తున్న విషయం మరిచి.. ముష్కరులు పిరికితనంతో రహస్యంగా దాడికి వచ్చారని ఆయన తెలిపారు. నేరుగా ప్రధాన ఉగ్రవాద కేంద్రాలపై దాడి చేసి నేలమట్టం చేశారంటూ భారత సైనికుల ధైర్యాన్ని ఆయన ప్రశంసించారు. తొమ్మిది ఉగ్రవాద స్థావరాలు ధ్వంసమవగా, 100 మందికి పైగా ఉగ్రవాదులు హతులయ్యారు. భారత్‌ను రెచ్చగొడితే ఫలితంగా పూర్తి విధ్వంసమే మిగులుతుందన్న విషయం ఉగ్రవాద సూత్రధారులకు ఇప్పుడు అర్థమైందన్నారు. దేశంలో అమాయకుల రక్తం చిందించే ఎలాంటి ప్రయత్నం చేసినా, అది వారి వినాశనానికే దారితీస్తుందని చెప్తూ.. ఈ ఉగ్రవాదులకు ఆశ్రయం కల్పించిన పాకిస్తాన్ సైన్యాన్ని భారత సైన్యం, వైమానిక దళం, నావికాదళం నిర్ణయాత్మకంగా ఓడించాయని స్పష్టం చేశారు. "భారత సాయుధ దళాలు పాకిస్తాన్‌కు స్పష్టమైన సందేశాన్ని పంపాయి - ఉగ్రవాదులకు సురక్షిత స్వర్గధామమేదీ లేదు'' అని ప్రధానమంత్రి వ్యాఖ్యానించారు. వారి సొంత భూభాగంలోనే భారత్ వారిపై దాడి చేస్తుందని, తప్పించుకునే అవకాశాన్ని ఇవ్వబోదని స్పష్టం చేశారు. భారత డ్రోన్లు, క్షిపణులు పాకిస్తాన్‌లో భయం నింపాయని, వాటి గురించి ఆలోచిస్తేనే పాకిస్తాన్‌కు రోజుల తరబడి నిద్ర పట్టదని చెప్పారు. మహారాణా ప్రతాప్ గుర్రం చేతక్ గురించి రాసిన పంక్తులను ప్రస్తావిస్తూ.. ఈ మాటలు ఇప్పుడు భారత అధునాతన ఆయుధ సంపత్తికి సరిగ్గా సరిపోతాయని ఆయన వ్యాఖ్యానించారు.

"ఆపరేషన్ సిందూర్ విజయం దేశ సంకల్పాన్ని బలోపేతం చేసింది, దేశాన్ని ఏకం చేసింది, భారత సరిహద్దులను కాపాడింది, దేశ ప్రతిష్ఠను శిఖరాగ్రానికి చేర్చింది" అని శ్రీ మోదీ వ్యాఖ్యానించారు. సాయుధ బలగాల కృషి అపూర్వం, అనూహ్యం, అద్భుతం అని అభివర్ణిస్తూ.. వారి అసాధారణ కృషిని ప్రశంసించారు. ఎంత కచ్చితత్వంతో భారత వైమానిక దళం దాడులు చేసిందో వివరిస్తూ.. పాకిస్తాన్ లోపల ఉన్న ఉగ్రవాద స్థావరాలను లక్ష్యం చేసుకుని విజయం సాధించారని వ్యాఖ్యానించారు. కేవలం 20-25 నిమిషాల్లోనే భారత దళాలు సరిహద్దులు దాటి పూర్తి కచ్చితత్వంతో దాడులు చేశాయని, నిర్దిష్ట లక్ష్యాలను ఛేదించాయని శ్రీ మోదీ వ్యాఖ్యానించారు. ఆధునికమైన, సాంకేతికంగా సన్నద్ధంగా ఉన్న, అత్యంత వృత్తి నైపుణ్యం కలిగిన దళం మాత్రమే అటువంటి కార్యకలాపాలను నిర్వహించగలదని స్పష్టం చేశారు. భారత సైన్యం వేగం, కచ్చితత్వాన్ని ప్రశంసించారు. వారి నిర్ణయాత్మక చర్యలు శత్రువును పూర్తిగా నివ్వెరపరిచాయని ఆయన వ్యాఖ్యానించారు. తమ బలమైన కోటలు రాళ్లూరప్పలుగా ఎప్పుడు మారాయో కూడా ప్రత్యర్థులకు తెలియలేదన్నారు.

పాకిస్తాన్ లోపలి భాగంలో ఉన్న ఉగ్రవాద ప్రధాన కేంద్రాలపై దాడి చేసి, ముఖ్యులైన ఉగ్రవాద కార్యకర్తల నిర్మూలనే లక్ష్యంగా భారత్ ముందుకెళ్లిందని ప్రధానమంత్రి స్పష్టం చేశారు. పాకిస్తాన్ పౌర విమానాలను రక్షణగా ఉపయోగించుకుని తన కార్యకలాపాలు కొనసాగించే ప్రయత్నం చేసినప్పటికీ భారత దళాలు అత్యంత జాగ్రత్తగా, కచ్చితత్వంతో స్పందించాయని తెలిపారు. అప్రమత్తతతో, బాధ్యతతో మెలుగుతూ లక్ష్యాన్ని విజయవంతంగా పూర్తి చేసిన సాయుధ దళాలను ఆయన ప్రశంసించారు. భారత సైనికులు తమ లక్ష్యాలను పూర్తి కచ్చితత్వంతో, దృఢ సంకల్పంతో నెరవేర్చారని ఆయన సగర్వంగా ప్రకటించారు. పాకిస్తాన్‌లోని ఉగ్రవాద, వైమానిక స్థావరాలే కాదు.. వారి దురుద్దేశాలు, తెంపరితనాన్నీ కూడా ఈ ఆపరేషన్ అణచివేసిందని వ్యాఖ్యానించారు.

ఆపరేషన్ సిందూర్ తర్వాత, పాకిస్తాన్ తీవ్రమైన నిరాశతో, భారత వైమానిక స్థావరాలే లక్ష్యంగా పలుమార్లు దాడులకు విఫల యత్నం చేసిందని శ్రీ నరేంద్ర మోదీ తెలిపారు. అయితే, పాకిస్తాన్ చేసిన అన్ని దాడులను మన సైన్యం సమర్థంగా తిప్పికొట్టిందన్నారు. పాకిస్తాన్ డ్రోన్లు, యూఏవీలు, విమానాలు, క్షిపణులు అన్నీ శక్తిమంతమైన భారత గగనతల రక్షణ వ్యవస్థ ముందు పూర్తిగా నిర్వీర్యం అయ్యాయని ఆయన స్పష్టం చేశారు. భారత సన్నద్ధత, సాంకేతిక బలం శత్రు దాడులను పూర్తిగా అణిచివేశాయన్నారు. దేశ వైమానిక స్థావరాల రక్షణ కోసం పనిచేసిన మన వైమానిక దళ సిబ్బందిని ప్రశంసించిన ప్రధానమంత్రి, దేశాన్ని రక్షించడంలో వారి అద్భుతమైన పనితీరు, అచంచలమైన అంకితభావాన్ని కొనియాడారు.

ఉగ్రవాదం పట్ల భారత వైఖరి ఇప్పుడు విస్పష్టంగా ఉందన్న ప్రధానమంత్రి, మరోమారు భారత్‌పై ఉగ్ర దాడి జరిగితే, దేశం నిర్ణయాత్మకంగా, పూర్తి బలంతో గట్టిగా ప్రతిస్పందిస్తుందని ప్రకటించారు. గతంలో సర్జికల్ దాడులు, వైమానిక దాడుల సమయంలో భారత్ తీసుకున్న దృఢమైన చర్యలను గుర్తుచేసిన ప్రధానమంత్రి, దాడులను ఎదుర్కోవడంలో ఆపరేషన్ సిందూర్ ఇప్పుడు దేశానికి సరికొత్త ప్రమాణాన్ని నిర్దేశించిందన్నారు. నిన్న రాత్రి జాతిని ఉద్దేశించి ప్రసంగించిన సమయంలో ప్రస్తావించిన మూడు కీలక సూత్రాలను ఆయన పునరుద్ఘాటించారు. మొదటిది, భారత్‌పై ఉగ్రవాదానికి పాల్పడితే తగిన బుద్ధి చెప్పేలా గట్టి సమాధానం ఇస్తుంది. భారత్ తన సొంత మార్గంలో, స్వీయ నిబంధనల ప్రకారం స్పందిస్తుంది. ఉగ్రవాద మూలాలు బయటపడే ప్రతిచోట కఠిన చర్యలు ఉంటాయి. రెండోది, అణుబాంబు బెదిరింపుల్ని భారత్ ఏమాత్రం సహించదు. ఈ ముసుగులో విజృంభిస్తున్న ఉగ్రవాద స్థావరాలపై కచ్చితమైన, నిర్ణయాత్మకమైన దాడులు కొనసాగిస్తుంది. మూడోది ఉగ్రవాద తండాలను, వాటిని ప్రోత్సహించే ప్రభుత్వాన్ని భారత్ విడివిడిగా చూడదు. "ప్రపంచం ఇప్పుడు ఈ సరికొత్త, దృఢ నిశ్చయంతో ఉన్న భారత్‌ను చూస్తోంది. జాతీయ భద్రత, ఉగ్రవాద నిర్మూలన పట్ల మన దృఢమైన విధానానికి అనుగుణంగా ముందుకుసాగుతోందని ప్రధానమంత్రి వివరించారు.

"ఆపరేషన్ సిందూర్ భారత సాయుధ దళాల బలం, సామర్థ్యానికి నిదర్శనంగా నిలుస్తుంది" అని శ్రీ నరేంద్ర మోదీ వ్యాఖ్యానించారు, సైన్యం, నావికాదళం, వైమానిక దళం అసాధారణ సమన్వయంతో పనిచేశాయని ప్రశంసించారు. వారి సమష్టితత్వం అద్భుతమైనదని పేర్కొన్నారు. సముద్రాలపై పూర్తి ఆధిపత్యం కనబరిచిన నావికా దళం, సరిహద్దులను బలోపేతం చేసిన సైన్యం అలాగే దాడులు చేయడం.. వైమానిక స్థావరాల రక్షణ వంటి రెండు విధుల్లోనూ రాణించిన భారత వైమానిక దళాల పనితీరు అద్భుతమని ప్రధానమంత్రి కితాబిచ్చారు. సరిహద్దు భద్రతా దళం (బీఎస్ఎఫ్), ఇతర భద్రతా దళాలు అత్యుత్తమ పనితీరు కనబరిచాయని ఆయన ప్రశంసించారు. భారత సమగ్ర గగనతల, సరిహద్దు రక్షణ వ్యవస్థల ప్రభావాన్ని ప్రధానంగా ప్రస్తావించిన ప్రధానమంత్రి... ఈ స్థాయి సమష్టిత్వం నేడు భారత సైనిక పరాక్రమానికి ప్రతీకగా నిలిచిందని ప్రకటించారు.

ఆపరేషన్ సిందూర్ సమయంలో మన సైన్యం, అధునాతన సైనిక సాంకేతికతల మధ్య సమన్వయాన్ని ప్రధానంగా ప్రస్తావించిన శ్రీ నరేంద్ర మోదీ... అనేక యుద్ధాల్లో సత్తా చాటిన భారత సంప్రదాయ గగనతల రక్షణ వ్యవస్థలు నేడు స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందిన ఆకాశ్.. ఎస్-400 వంటి ఆధునిక, శక్తిమంతమైన వ్యవస్థలతో మరింత బలోపేతం అయ్యాయని పేర్కొన్నారు. భారత దృఢమైన రక్షణ కవచం మన బలాన్ని చాటిచెప్పిందన్నారు. పాకిస్తాన్ పదే పదే దాడులకు ప్రయత్నాలు చేసినప్పటికీ, భారత వైమానిక స్థావరాలు, కీలకమైన రక్షణ మౌలిక సదుపాయాలు పూర్తిగా సురక్షితంగా ఉన్నాయని తెలిపారు. సరిహద్దుల్లో మోహరించి ఉన్న ప్రతి సైనికుడి అంకితభావం, పరాక్రమం అలాగే ఈ ఆపరేషన్‌లో పాల్గొన్న ప్రతి వ్యక్తి నిబద్ధత కారణంగానే ఈ విజయం సాధ్యమైందని ప్రధానమంత్రి ప్రశంసించారు. తిరుగులేని భారత జాతీయ భద్రతకు వారి నిబద్ధతే మూలమని ఆయన వ్యాఖ్యానించారు.

పాకిస్తాన్‌తో పోల్చడానికి కూడా వీలులేనంత గొప్ప అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం భారత్ వద్ద ఉందని స్పష్టం చేసిన శ్రీ నరేంద్ర మోదీ... గత దశాబ్దంలో భారత వైమానిక దళం, ఇతర సైనిక విభాగాలు ప్రపంచంలోని అత్యంత అధునాతన రక్షణ సాంకేతిక పరిజ్ఞానాలను పొందాయన్నారు. కొత్త సాంకేతికతతో గణనీయమైన సవాళు వస్తాయనీ, ఈ సంక్లిష్టమైన, అధునాతన వ్యవస్థలను సమర్థవంతంగా నిర్వహించడానికి అపారమైన నైపుణ్యంతో పాటు కచ్చితత్వం కూడా అవసరమని ఆయన అభిప్రాయపడ్డారు. వ్యూహాత్మక నైపుణ్యంతో సాంకేతికతను సజావుగా అనుసంధానించి ఆధునిక యుద్ధంలో ఆధిపత్యాన్ని ప్రదర్శించిన భారత సాయుధ దళాలను ప్రశంసిస్తూ... భారత వైమానిక దళం ఇప్పుడు ఆయుధాలతోనే కాకుండా డేటా, డ్రోన్‌లతో కూడా ప్రత్యర్థుల భరతం పట్టే కళలో ప్రావీణ్యం సంపాదించిందని శ్రీ నరేంద్ర మోదీ వ్యాఖ్యానించారు.

పాకిస్తాన్ విజ్ఞప్తి మేరకు భారత్ తన సైనిక చర్యను తాత్కాలికంగా నిలిపివేసిందని పేర్కొంటూ, పాకిస్తాన్ మరోసారి ఉగ్రవాద కార్యకలాపాలు.. రెచ్చగొట్టే సైనిక చర్యలకు పాల్పడితే, భారత్ పూర్తి బలంతో ప్రతీకారం తీర్చుకుంటుందని ప్రధానమంత్రి స్పష్టం చేశారు. భారత్ ప్రతిస్పందన పూర్తిగా తన సొంత నిబంధనల ప్రకారమే ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ఈ నిర్ణయాత్మక వైఖరికి దేశ సాయుధ దళాల ధైర్యం, పరాక్రమం, అప్రమత్తతే కారణమవన్నారు. సైనికులు తమ అచంచలమైన సంకల్పం, ఉత్సాహం, సన్నద్ధతను కొనసాగించాలని కోరుతూ, అన్ని సమయాల్లో అప్రమత్తంగా, సంసిద్ధంగా ఉండాలని సూచించారు. ఇది నవ భారతం ? ఈ భారత్ శాంతినే కోరుకుంటుంది కానీ మానవాళికి ముప్పు వాటిల్లితే శత్రువులను అణిచివేయడానికి ఏ మాత్రం వెనుకాడదు అని వ్యాఖ్యానిస్తూ ప్రధానమంత్రి తన ప్రసంగాన్ని ముగించారు.

# కనకదుర్గమ్మకు అగ్గిపెట్టిలో పట్టుచీర !

అమరావతి, మే 15: విజయవాడ ఇంద్రకీలాద్రిపై వెలసిన శ్రీ దుర్గా మల్లేశ్వరి స్వామి వార్ల ఆలయంలో కొలువై ఉన్న కనకదుర్గమ్మ అమ్మవారికి తెలంగాణలోని సిరిసిల్లకు చెందిన నల్ల విజయ్ కుమార్ అనే చేనేత కార్మికుడు బుధవారం అగ్గిపెట్టెలో పట్టుచీర సమర్పించారు.

నల్ల విజయ్ కుమార్ కుటుంబం ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి తమ ఇంటి దేవత శ్రీ కనకదుర్గను సందర్శించి, ఆమె ఆశీస్సులు పొంది.. అమ్మవారికి ప్రత్యేకంగా తయారు చేసిన పట్టు చీరను బహుమతిగా ఇవ్వడం ఆనవాయితీగా వస్తోంది.

ఈ నేపథ్యంలో అగ్గిపెట్టెతో ఇమిడే వట్టు చీరను భక్తితో అమ్మవారికి సమర్పించారు. చేనేత కళాకారుడు తయారు చేసిన ఈ చీర 100 గ్రాముల బరువు కాగా.. ఐదున్నర మీటర్ల పొడవు, 48 అంగుళాల వెడల్పు ఉంటుంది.

దీనిని పూర్తిగా పట్టు దారాలు, గోల్డ్ జరి వాడడం జరిగిందని.. దీనిని తయారు చేయడానికి దాదాపు ఐదు రోజులు పట్టిందని నల్ల విజయ్ కుమార్ చెప్పారు.

ఆలయ కార్యనిర్వాహక అధికారి వి.కె. సీనానాయక్ వీరిని అభినందించి, అమ్మవారి దర్శన ఏర్పాట్లు చేసి, ప్రసాదాలు అందజేశారు.

# మాచర్ల మున్సిపల్ ఛైర్మన్ తురకా కిశోర్ పై అనర్హతవేటు

అమరావతి, మే 15:పల్నాడు జిల్లా మాచర్ల మున్సిపల్ ఛైర్మన్ తురకా కిశోర్‌ను ఏపీలోని కూటమి ప్రభుత్వం పదవి నుంచి తొలగిస్తూ నేడు ఉత్తర్వులు జారీ చేసింది. వరుసగా 15 కౌన్సిల్ సమావేశాలకు అతడు గైర్హాజరు కావడమే ఈ నిర్ణయానికి ప్రధాన కారణంగా తెలుస్తోంది. మున్సిపల్ పరిపాలనలో ఛైర్మన్ బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించకపోవడం, ముఖ్యంగా కౌన్సిల్ సమావేశాలకు హాజరుకాకపోవడం వంటి అంశాలను ప్రభుత్వం తీవ్రంగా పరిగణించింది.

ఏపీ మున్సిపల్ చట్టంలోని సెక్షన్ 16(1)(కె) నిబంధనలను తురకా కిశోర్ ఉల్లంఘించినట్లు నిర్ధారణ కావడంతో అతడిని పదవి నుంచి తప్పిస్తున్నట్లు ప్రభుత్వ ఉత్తర్వుల్లో స్పష్టంగా పేర్కొన్నారు. తురకా కిశోర్ ప్రస్తుతం పోలీసుల అదుపులో ఉన్నట్లు కూడా ప్రభుత్వం వెల్లడించింది. గతంలో ఛైర్మన్ అధికారాలను దుర్వినియోగం చేశారన్న ఆరోపణలపై తురకా కిశోర్‌కు ప్రభుత్వం షోకాజ్ నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే.

ఆ నోటీసులపై అతడి నుంచి ఎటువంటి స్పందన రాకపోవడంతో, తాజా పరిణామాల నేపథ్యంలో ప్రభుత్వం ఈ కఠిన నిర్ణయం తీసుకుంది. ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ పరిపాలన శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్. సురేష్ కుమార్ ఈ తొలగింపు ఉత్తర్వులను జారీ చేశారు. ఈ పరిణామం మాచర్ల రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. తదుపరి ఛైర్మన్ ఎంపిక ప్రక్రియపై త్వరలోనే స్పష్టత వచ్చే అవకాశం ఉంది. గతంలో వైసీపీ ప్రభుత్వ హయాంలో? టీడీపీ నేతలు బుద్దా వెంకన్న, బొండా ఉమలపై తురకా కిశోర్ దాడి చేయడం సంచలనం సృష్టించింది. కిశోర్ పై 10 వరకు కేసులు ఉన్నట్టు తెలుస్తోంది. వాటిలో మూడు హత్యాయత్నం కేసులు కాగా, మరో 7 ఇతర కేసులు ఉన్నాయి. కిశోర్ ప్రస్తుతం పోలీసుల అదుపులో ఉన్నాడు

# వీరయ్య కుటుంబానికి అండగా ఉంటాం -నారా లోకేష్ భరోసా



అమరావతి, మే 15:ఇటీవల ఒంగోలులో దారుణహత్యకు గురైన టీడీపీ నేత, మాజీ ఎంపీపీ ముప్పవరపు వీరయ్య చౌదరి కుటుంబ సభ్యులను విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ పరామర్శించారు. ఈరోజు ఉదయం ప్రకాశం జిల్లా నాగులుప్పలపాడు మండలం అమ్మనబ్రోలులోని వీరయ్య చౌదరి నివాసానికి వెళ్లిన మంత్రి లోకేశ్ ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం వీరయ్య చౌదరి సతీమణి, కుమారుడు, ఇతర కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు.

వీరయ్య చౌదరితో తనకున్న అనుబంధాన్ని ఈ సందర్భంగా మంత్రి గుర్తు చేసుకున్నారు. యువగళం పాదయాత్ర సమయంలో తనతో పాటు అడుగులు వేశారని, పార్టీ బలోపేతం కోసం కృషిచేసిన వీరయ్య చౌదరి దారుణహత్య బాధాకరమని అన్నారు. హత్య నిందితులను కఠినంగా శిక్షిస్తామన్నారు. వీరయ్య చౌదరి కుటుంబానికి పార్టీ అన్ని విధాల అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో మంత్రులు డోలా బాల వీరాంజనేయ స్వామి, గొట్టిపాటి రవి, ఎమ్మెల్యేలు దామచర్ల జనార్ధన్, ఉగ్ర నరసింహా రెడ్డి, బీఎన్ విజయకుమార్, ఇంటూరి నాగేశ్వరరావు, జిల్లా టీడీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

# అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు- ఏర్పాట్లపై సిఎస్ సమీక్ష !

అమరావతి, మే 15:అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు జూన్ 21న విశాఖపట్నంలో జరగనున్నాయి. ఈ వేడుకలకు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ముఖ్య అతిధిగా హాజరుకానున్నారు. అందుకు సంబంధించి చేయాల్సిన ఏర్పాట్లపై బుధవారం విజయవాడలోని సిఎస్ క్యాంపు కార్యాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ సంబంధిత శాఖల అధికారులతో ప్రాథమికంగా సమీక్ష నిర్వహించారు.

జూన్ 21న విశాఖలో "జనీణజీ టనీతీ రానివ ఇజీతీబిష్ఠ,రానివ ఊవజీశ్రీబిష్ఠ" అనే నినాదంతో 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం తగిన ఏర్పాట్లు చేయనుంది. రాష్ట్ర ప్రభుత్వం "యోగాంధ్ర-2025" నినాదంతో ప్రజల్లో యోగావట్ల అవగాహన కల్పించేందుకు పెద్ద ఎత్తున చర్యలు తీసుకుంటోంది.

ఈనెల 29వ తేదీ నుండి 4 వారాలు ప్రచార కార్యక్రమ కార్యాచరణ ప్రణాళికను అమలు చేయనుంది. ఈనెల 29వ తేదీ నుండి మొదటి వారం రోజులు అన్ని జిల్లాల్లో జిల్లా స్థాయిలో యోగా అవగాహన ప్రచార కార్యక్రమాలు, జూన్ 5వ తేదీ నుండి వారం రోజుల పాటు అసెంబ్లీ నియోజకవర్గం స్థాయిలోను, జూన్ 12 నుండి వారం రోజుల పాటు గ్రామ స్థాయిలోను, జూన్ 17 నుండి విద్యా సంస్థల స్థాయిలో పెద్ద ఎత్తున అవగాహన ప్రచార కార్యక్రమాలు నిర్వహించనుంది.

ఈ సందర్భంగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానుద్ మాట్లాడుతూవిశాఖలో నిర్వహించే అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలను విజయవంతంగా నిర్వహించేందుకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాల్సి ఉందని అన్నారు. ఏర్పాట్ల పర్యవేక్షణకు రాష్ట్ర స్థాయిలో వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి యం.టి.కృష్ణబాబును ప్రభుత్వం నోడలు అధికారిగా నియమించిందని తెలిపారు.

విశాఖపట్నం నగరంలోని వివిధ విద్యా సంస్థలకు చెందిన 8వ తరగతి మొదలు డిగ్రీ,పిజి చదివే విద్యార్థులు అందరినీ ఈకార్యక్రమంలో భాగస్వాములను చేయాలని చెప్పారు. అదే విధంగా రాష్ట్ర వ్యాప్తంగా ఆయుష్ మిషన్ ప్రతినిధులు, యోగా శిక్షకులు,యోగా స్పోర్ట్స్ అసోసియేషన్లు, యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్లు,పిఇటిలు, స్పోర్ట్స్ కోచ్ లు,విశాఖలోని పలు కేంద్ర ప్రభుత్వ సంస్థలను పెద్ద ఎత్తున భాగస్వాములను చేయాలని సిఎస్ విజయానంద్ సూచించారు.

ఈసమావేశంలో రాష్ట్ర సాధారణ పరిపాలన శాఖ ముఖ్య కార్యదర్శి ముకేశ్ కుమార్ మీనా,వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ వీరపాండ్యన్, ఆయుష్ డైరెక్టర్ దినేష్ కుమార్ పాల్గొన్నారు.అలాగే పిఆర్ అండ్ ఆర్డి ముఖ్య కార్యదర్శి శశి భూషణ్ కుమార్, విద్యా శాఖ కార్యదర్శి కె.శశిధర్,సిఆర్డిఏ కమీషనర్ కె.కన్నబాబు,ఐటి శాఖ కార్యదర్శి కె.భాస్కర్, యువజన సర్వీసుల శాఖ కార్యదర్శి వినయ్ చంద్ తదితరులు పాల్గొన్నారు.

# ఉత్తర్‌ప్రదేశ్‌లో సెమీకండక్టర్ యూనిట్ కు మంత్రిమండలి ఆమోదం

న్యూఢిల్లీ, మే 15:భారత్ సెమీకండక్టర్ మిషన్‌లో భాగంగా మరో సెమీకండక్టర్ యూనిటును ఏర్పాటు చేయడానికి ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ అధ్యక్షతన సమావేశమైన కేంద్ర మంత్రివర్గం ఈ రోజు ఆమోదం తెలిపింది.

దేశంలో ఇప్పటికే అయిదు సెమీకండక్టర్ యూనిట్ల నిర్మాణపనులు పురోగమిస్తున్నాయి. ఈ ఆరో యూనిటుతో కలిపి, భారత్ వ్యూహాత్మకంగా కీలకమైన సెమీకండక్టర్ పరిశ్రమను అభివృద్ధిపరిచే దిశగా వేగంగా ముందుకు సాగిపోతోంది.

ఈ రోజు ఆమోదం తెలిపిన యూనిట్ హెచ్‌సీఎల్, ఫాక్స్‌కాన్.. ఈ రెండు కంపెనీలు కలిసి ఏర్పాటు చేయనున్న ఓ సంయుక్త సంస్థ (జేవీ). హార్డ్‌వేర్‌ను అభివృద్ధిపరచడంలో, తయారు చేయడంలో సుదీర్ఘ అనుభవం హెచ్‌సీఎల్ సొంతం. ఎలక్ట్రానిక్స్ రంగంలో ప్రపంచ స్థాయి ప్రముఖ కంపెనీగా ఫాక్స్‌కాన్‌కు పేరుంది. ఈ రెండు కంపెనీలు సంయుక్తంగా యమునా ఎక్స్‌ప్రెస్‌వే పారిశ్రామిక అభివృద్ధి ప్రాధికార సంస్థ (లేదా వైఈఐడీఏ)లో జేవర్ విమానాశ్రయం సమీపంలో ఒక యూనిట్ ను నెలకొల్పనున్నాయి. ఈ ప్లాంటు మొబైల్ ఫోన్లు, ల్యాప్‌టాపులు, ఆటోమొబైల్స్, పీసీలతో పాటు డిస్‌ప్లేకు సంబంధించిన ఇతర ఉపకరణాల కోసం డిస్‌ప్లే డ్రైవర్ చిప్సును తయారు చేస్తుంది. ఈ ప్లాంటును ప్రతి నెలా 20,000 వేఫర్స్‌కు రూపురేఖలు కల్పించే విధంగా డిజైన్ చేశారు. దీని డిజైన్ అవుట్‌పుట్ సామర్థ్యం నెలకు మూడు లక్షల అరవై వేల యూనిట్లు ఉంటుంది. సెమీకండక్టర్ పరిశ్రమ ఇప్పుడు యావత్తు దేశంలో విస్తరిస్తోంది. దేశమంతటా అనేక రాష్ట్రాల్లో ప్రపంచ స్థాయి డిజైన్ సదుపాయాలు అందుబాటులో ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వాలు డిజైన్ సంస్థలను ప్రోత్సహించడానికి అదేపనిగా ప్రయత్నాలు చేస్తున్నాయి.

కొత్త ఉత్పత్తులకు తుదిరూపాన్నిచ్చే పనుల్లో 270 విద్యాబోధన సంస్థలతోపాటు 70 అంకుర సంస్థల విద్యార్థులు, ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు తలమునకలుగా ఉన్నారు. ఈ విద్యా సంస్థలు తీర్చిదిద్దే 20 ఉత్పత్తులను టేప్ అవుట్ (డిజైన్ దశలో అవసరమైన ప్రతి విషయాన్నీ సరిచూసే, గుర్తింపు దశకు చేర్చే ప్రక్రియ) బాధ్యతను ఎస్‌సీఎల్ మొహాలీ చేపట్టి పూర్తి చేసింది.

ఈ రోజు ఆమోదం తెలిపిన కొత్త సెమీకండక్టర్ యూనిటును ఏర్పాటు చేయడానికి ఇంచుమించు రూ.3,700 కోట్లు పెట్టుబడి అవసరమవుతుంది. భారత్ సెమీకండక్టర్ రంగంలో తన ప్రస్థానాన్ని కొనసాగిస్తున్న క్రమంలో, అనుబంధ విస్తారిత వ్యవస్థ భాగస్వామ్య సంస్థలు కూడా ఇండియాలో తమ తమ సదుపాయాలను ఏర్పాటు చేశాయి. అప్లయిడ్ మెటీరియల్స్, ల్యామ్ రిసెర్చ్.. ఇవి రెండూ కూడా అన్నింటి కంటే పెద్ద సామగ్రి తయారీదారు సంస్థలుగా కొలువుదీరాయి. ఈ రెండు సంస్థలు ప్రస్తుతం దేశంలో తమకంటూ ఓ ఉనికిని కలిగి ఉన్నాయి. మెర్క్, లిండే, ఎయిర్ లిక్విడ్, ఐనాక్స్‌లతో పాటు అనేక ఇతర గ్యాస్, రసాయనిక సరఫరాదారు సంస్థలు మన సెమీకండక్టర్ పరిశ్రమలో వృద్ధిని నమోదు చేసేందుకు పూర్తి స్థాయిలో సిద్ధమయ్యాయి.

మన దేశంలో ల్యాప్‌టాపులు, మొబైల్ ఫోన్లు, సర్వర్, వైద్య సంబంధ పరికరాలు, విద్యుత్తు ఎలక్ట్రానిక్స్, రక్షణ సామగ్రితోపాటు ఇతర వినియోగదారు ఎలక్ట్రానిక్ ఉత్పత్తుల తయారీ వేగంగా వర్ధిల్లుతోంది.

# సిబిల్ స్కోర్‌కు రాజీవ్ యువవికాసం ఎంపికకు సంబంధం లేదు

- అసత్య ప్రచారాలను నమ్మవద్దు
- కాంగ్రెస్ నేత పరికపల్లి

ఖమ్మం, మే 15 (నేటినిజం ప్రతినిధి) : కొనిజర్ల మండల కేంద్రం నందు గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో కాంగ్రెస్ జిల్లా నాయకులు పరికపల్లి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ...గత పదేళ్ల దొరల పాలనలో కల్వకుంట్ల కుటుంబానికే తప్ప తెలంగాణ రాష్ట్రంలోని ఏ ఒక్క నిరుద్యోగికి ఉద్యోగ నోటిఫికేషన్ ఇవ్వకపోవడమే కాక, యువతకు ప్రభుత్వం తరపున ఏమాత్రం లబ్ధి చేకూరలేదని, కానీ ఇందిరమ్మ రాజ్యంలో యువత స్వయం ఉపాధితో కుటుంబానికి అండగా ఉండాలనే ఉద్దేశంతో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలంగాణ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో యువతకు స్వయం ఉపాధి కోసం తీసుకొచ్చిన రాజీవ్ యువవికాసం పథకం లబ్ధిదారుల ఎంపిక సిబిల్ స్కోర్ ఆధారంగా జరుగుతుందని కొంతమంది దుష్ట శక్తులు చేస్తున్న ప్రచారం పూర్తిగా అవాస్తవమని తేల్చి చెప్పారు. అదేవిధంగా రాష్ట్రంలో నిరుద్యోగులకు వరంగా రాజీవ్ యువ వికాసం పథకం తీసుకువచ్చాం. ప్రతిపక్షాలు రాజకీయాల కోసం యువత జీవితాలతో ఆడుకోవద్దు. అభ్యర్థుల ఎంపిక పారదర్శకంగా వేగంగా జరుగుతుంది.

# నక్సల్ బాధిత ప్రాంతాల్లో శాంతిని పునరుద్ధరించడానికి మేం పూర్తిగా కట్టుబడి ఉన్నాం: ప్రధానమంత్రి

నక్సలిజాన్ని వేళ్లతో సహా పెకలించే దిశగా మేం నడుపుతున్న ఉద్యమం సరి అయిన మార్గంలో ముందుకు సాగిపోతోందని భద్రత దళాలు సాధించిన విజయం చాటుతోంది అని ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ అన్నారు. "నక్సలైట్ల వల్ల ప్రభావితమైన ప్రాంతాల్లో శాంతిని పునరుద్ధరించడంతో పాటు ఆయా ప్రాంతాలను అభివృద్ధి సహిత ప్రధాన స్రవంతిలోకి చేర్చడానికి మేం పూర్తి స్థాయిలో కట్టుబడి ఉన్నాం" అని శ్రీ మోదీ అన్నారు.

కేంద్ర హోం శాఖ మంత్రి శ్రీ అమిత్ షా మాటలకు ప్రధాని స్పందిస్తూ, సామాజిక మాధ్యమం ఎక్స్‌లో ఒక సందేశాన్ని పొందుపరిచారు. ఆ సందేశంలో:

"నక్సలిజాన్ని కూకటివేళ్లతో సహా నిర్మూలించే దిశలో మా ఉద్యమం సరి అయిన మార్గంలో ముందుకు సాగుతోందని భద్రతదళాలు సాధించిన ఈ విజయం చాటిచెబుతోంది. నక్సలిజం వల్ల ప్రభావితమైన ప్రాంతాల్లో శాంతిని పునరుద్ధరించి, ఆయా ప్రాంతాలను అభివృద్ధి సహిత ప్రధాన స్రవంతిలో కలపడానికి మేం పూర్తి స్థాయిలో నిబద్ధులమై ఉన్నాం" అని ప్రధాని పేర్కొన్నారు.

# అనంతలో భారీ వర్షం.. లోతట్టు ప్రాంతాలు మునక



అనంతపురం బ్యూరో, మే 15 : అనంతపురం జిల్లాలో గురువారం తెల్లవారుజామున భారీ వర్షం కురిసింది. రాప్తాడు సమీపంలోని శివారు కాలనీలోకి నీరు ప్రవేశించడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. వారిని అధికారులు రక్షణ చర్యలతో బయటకు తెచ్చారు. నీట మునిగిన ఇళ్లలో అన్ని వస్తువులు తడిసి ముద్దయిపోయాయి. జిల్లా వ్యాప్తంగా సగటు 554.2 మిల్లీమీటర్ల వర్షం నమోదైనట్లు ముఖ్య ప్రణాళిక అధికారి అశోక్ తెలిపారు. రాప్తాడు మండలంలో అత్యధికంగా 141.2 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. దీంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. జేఎన్టీయూ యూనివర్సిటీ వద్ద నిర్మించిన ప్రహరీ గోడ నీటి ప్రవాహానికి కూలిపోయింది. కదిరి రోడ్ లో ఉన్న లేపాక్షి నగర్ లోకి వరద నీరు ప్రవహించడంతో స్థానికులు ఆందోళన చెందారు.

అధికారులు నీటిని మళ్లించే ప్రయత్నం చేపట్టారు. అనేక సంవత్సరాలుగా చిన్న చిన్న వంకలు పూర్తిగా ఆక్రమించి గృహ నిర్మాణాలు చేపట్టడం వల్ల ఈ పరిస్థితి ఏర్పడింది. తడకలేరు పై ప్రాంతంలో కురిసిన వర్షాల వల్ల రుద్రంపేట బైపాస్ లో ప్రజాశక్తి నగర్, బీజేపీ కొట్టాలు ఇతర ప్రాంతాల్లోకి వరద నీరు ప్రవహించింది. ఆత్మకూరులో 38 మిల్లీమీటర్లు, బ్రహ్మసముద్రం 35, బుక్కరాయసముద్రం 34.2, అనంతపురం రూరల్ 30.2, సెట్టూరు 27.6, పామిడి నార్పల 25.6, అనంతపురం అర్బన్ 24.2, రాయదుర్గం 12.4, కంబదూరు 12.4, గుమ్మగట్ట 10.2, యాడికి 10, పెద్దవడుగూరు 9.2 మిల్లీమీటర్ల వర్షం నమోదయింది. వర్షాల వల్ల మామిడి, బొప్పాయి, ఇతర పంటలకు నష్టం వాటిల్లినప్పటికీ, వేసవి కావడం వల్ల వర్షాల కారణంగా వాతావరణం చల్లబడింది. రైతులు వేసవి దుక్కులు దున్నుకునే ఏర్పాట్లలో తల మునకలయ్యారు. విత్తన వేరుశనగ కాయ కోసం అధికారుల వద్దకు పరుగులు తీస్తున్నారు.



# ఇప్పుడు త్రివర్ణ పతాకం రెపరెపలాడుతోంది: కేంద్ర హోం మంత్రి శ్రీ అమిత్ షా

న్యూఢిల్లీ, మే 15: ఛత్తీస్‌గఢ్–తెలంగాణ సరిహద్దులోని కర్రెగుట్టల కొండల్లో (కెజిహెచ్) నక్సలిజంపై జరిగిన అతిపెద్ద ఆపరేషన్‌లో భద్రతా దళాలు 31 మంది నక్సలైట్లను హతమార్చి, 'నక్సల్ రహిత భారత్' సంకల్పంలో చారిత్రాత్మక విజయాన్ని సాధించాయి.

కేంద్ర హోం, సహకార శాఖా మంత్రి శ్రీ అమిత్ షా ఎక్స్ వేదికగా చేసిన ఒక పోస్ట్ ద్వారా ఈ విధంగా స్పందించారు. ఒకనాడు ఎర్రజెండాల నీడలో నక్సల్స్ పాలించిన కర్రెగుట్టల కొండల్లో ఇప్పుడు సగర్వంగా త్రివర్ణ పతాకాన్ని ఎగురవేస్తున్నామన్నారు. కర్రెగుట్టల కొండ పీఎల్‌జీఏ బెటాలియన్ 1, డీకేఎస్‌జెడ్‌సీ, టీఎస్‌సీ, సీఆర్‌సీ వంటి ప్రధాన నక్సల్ వర్గాల ఉమ్మడి ప్రధాన కార్యస్థానంగా ఉంది. నక్సల్ శిక్షణ, అలాగే వ్యూహరచన, ఆయుధాల సమీకరణకు ఇది కేంద్రంగా ఉండేదని హోం మంత్రి పేర్కొన్నారు. మన భద్రతా దళాలు ఈ అతిపెద్ద నక్సల్ వ్యతిరేక ఆపరేషన్‌ను కేవలం 21 రోజుల్లోనే పూర్తి చేశాయనీ, ఈ ఆపరేషన్ సమయంలో భద్రతా దళాలకు ఎటువంటి ప్రాణనష్టం జరగకపోవడం పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేశారు. కఠినమైన వాతావరణం.. సవాళ్లతో కూడిన కొండ ప్రాంతంలో నక్సలైట్లను ధైర్యంగా ఎదుర్కొన్న సీఆర్‌పీఎఫ్, ఎస్‌టీఎఫ్, డీఆర్‌జీ సిబ్బందికి అభినందనలు తెలిపిన హోం మంత్రి.. యావత్ దేశం వారిని చూసి గర్వపడుతోందన్నారు. ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలో, నక్సలిజాన్ని దాని మూలాల నుంచి నిర్మూలించాలని దృఢంగా నిశ్చయించుకున్నామని ఆయన పేర్కొన్నారు. 2026, మార్చి 31 నాటికి భారత్ నక్సలైట్ల రహితంగా మారుతుందని ఆయన దేశ పౌరులకు హామీ ఇచ్చారు.

ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్‌లో, సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ (సీఆర్‌పీఎఫ్) డైరెక్టర్ జనరల్ శ్రీ జ్ఞానేంద్ర ప్రతాప్ సింగ్, ఛత్తీస్‌గఢ్ పోలీస్ డైరెక్టర్ జనరల్, ఛత్తీస్‌గఢ్ ఏడీజీ (యాంటీ-నక్సల్ ఆపరేషన్స్) శ్రీ అరుణ్ దేవ్ గౌతమ్‌లు సంయుక్తంగా నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఈ ఆపరేషన్ గురించిన వివరాలను తెలియజేశారు. ఛత్తీస్‌గఢ్–తెలంగాణ సరిహద్దులోని నక్సలైట్లకు దుర్భేద్యమైన కోటగా ఉన్న కర్రెగుట్టలు కొండ (కేజీహెచ్)లో 21 రోజుల పాటు జరిగిన 21 ఎన్‌కౌంటర్ల తర్వాత– ఛత్తీస్‌గఢ్ పోలీసులు, కేంద్ర సాయుధ పోలీసు బలగాలు (సీఏపీఎఫ్‌లు) 16 మంది మహిళా నక్సలైట్లతో సహా మొత్తం 31 మంది నక్సలైట్ల మృతదేహాలను, 35 ఆయుధాలను స్వాధీనం చేసుకున్నాయి. ఇప్పటి వరకు, 28 మంది నక్సలైట్లను గుర్తించారు. వారిపై మొత్తం రూ. 1 కోటి 72 లక్షల రివార్డులు ఉన్నాయి. ఏప్రిల్ 21 నుంచి మే 11 వరకు జరిగిన ఈ నక్సల్ వ్యతిరేక ఆపరేషన్‌లో భాగంగా, ఎన్‌కౌంటర్ స్థలం నుంచి స్వాధీనం చేసుకున్న మృతదేహాలు నిషేధిత, చట్టవిరుద్ధమైన, అత్యంత శక్తిమంతమైన సాయుధ నక్సల్ సంస్థ పీఎల్‌జీఏ బెటాలియన్, సీఆర్‌సీ కంపెనీ, తెలంగాణ రాష్ట్ర కమిటీ కేడర్‌లకు చెందిన నక్సల్స్‌వి కావచ్చని భావిస్తున్నారు.

పీఎల్‌జీఏ బెటాలియన్, సీఆర్‌సీ కంపెనీ, తెలంగాణ రాష్ట్ర కమిటీలకు బలమైన స్థావరాలుగా ఉన్న సుక్మా, బీజాపూర్ సరిహద్దు ప్రాంతాలు అనేక మంది అగ్రశ్రేణి క్యాడర్లకు నిలయంగా ఉన్నాయి. ఈ ప్రాంతంలో, సవాలుతో కూడిన పరిస్థితుల్లో, భద్రతా దళాలు అనేక కొత్త భద్రతా శిబిరాలను ఏర్పాటు చేశాయి. దీంతో వారికి ఈ ప్రాంతంపై పట్టు లభించింది. ఫలితంగా, నక్సలైట్లు ఒక ఉమ్మడి కమాండ్‌ను ఏర్పాటు చేసి, ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్, తెలంగాణలోని ములుగు సరిహద్దులోని అత్యంత సురక్షితంగా పరిగణించే కర్రెగుట్టల కొండ (కేజీహెచ్)లో ఆశ్రయం పొందారు. కేజీహెచ్ దాదాపు 60 కిలోమీటర్ల పొడవు.. 5 నుంచి 20 కిలోమీటర్ల వెడల్పు కలిగి, చాలా కఠినమైన, సవాలుతో కూడిన భూభాగం గల అత్యంత క్లిష్టమైన కొండ ప్రాంతం. గత రెండున్నరేళ్లుగా, నక్సలైట్లు ఈ ప్రాంతంలో తమ స్థావరాన్ని ఏర్పాటు చేసుకున్నారు. ఇక్కడ పీఎల్‌జీఏ బెటాలియన్ సాంకేతిక విభాగం (టీడీ యూనిట్) సహా, ఇతర ముఖ్యమైన సంస్థలకు చెందిన దాదావు 300–350 మంది సాయుధ నక్సలైట్లు ఆశ్రయం పొందారు. విశ్వసనీయ సమాచారం అందుకున్న ఛత్తీస్‌గఢ్ పోలీసులు, కేంద్ర సాయుధ పోలీసు బలగాలు సమగ్రమైన, సమన్వయంతో కూడిన ప్రణాళికను రూపొందించి ఏప్రిల్ 21న పెద్ద ఎత్తున ఉమ్మడిగా దాడులు ప్రారంభించాయి.

కేజీహెచ్‌లో జరిగిన ఈ ఆపరేషన్‌లో, వివిధ నిఘా సంస్థల నుంచి వచ్చిన సాంకేతిక, నిఘా బృందాల, క్షేత్ర స్థాయి సమాచారాన్ని సేకరించి, దానిని సంగ్రహించడం, విశ్లేషించడం కోసం బహుళ-ఏజెన్సీలతో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. సేకరించిన నిఘా సమాచారాన్ని ఉపయోగించి, మోహరించిన దళాల బలాన్ని నిర్ణయించడం, నిరంతర సమీకరణను షెడ్యూల్ చేయడం, అలాగే సకాలంలో పోలీసు దళాలను మార్చడం వంటి ఖచ్చితమైన ఆపరేషన్ ప్రణాళికను బృందం అమలు చేసింది. నిఘా సమాచారాన్ని నిరంతరం విశ్లేషించి, ఫీల్డ్ కమాండర్లకు సరైన సమయంలో సమాచారం అందేలా చేశారు. ఇది నక్సలైట్లకు సహాయం చేసే వారిని, వారి రహస్య స్థావరాలను, ఆయుధ నిల్వలను గుర్తించడంలో భద్రతా దళాలకు ఎంతగానో సహాయపడింది. అనేక సందర్భాలలో ఇంప్రూవైజ్డ్ ఎక్స్‌ప్లోజివ్ పరికరాల (ఐఈడీలు) నుంచి ప్రాణనష్టాన్ని నివారించడంలో కూడా ఈ సమాచారం సహాయపడింది. ఈ నిఘా ఆధారంగా, భద్రతా దళాలు గణనీయ సంఖ్యలో ఐఈడీలు, బీజీఎల్ షెల్స్, ఇతర పేలుడు పదార్థాలను విజయవంతంగా స్వాధీనం చేసుకున్నాయి. ఇప్పటివరకు నిర్వహించిన వాటిలో అతిపెద్ద, అత్యంత సమగ్రమైన, సమన్వయంతో కూడిన నక్సల్ వ్యతిరేక ఆపరేషన్‌గా ఇది నిలుస్తుంది. ఉమ్మడి వేదికపై ఐక్యంగా పనిచేసిన వివిధ రాష్ట్రాల, కేంద్ర ప్రభుత్వ సంస్థల మధ్య చక్కని సహకారానికి ఇది ఒక ముఖ్య ఉదాహరణ.

ఈ ఆపరేషన్ లో ఇప్పటి వరకు మొత్తం 214 నక్సల్స్ రహస్య స్థావరాలను, బంకర్లను ధ్వంసం చేశారు. మొత్తం 450 ఐఈడీలు, 818 బీజీఎల్ షెల్స్, 899 కట్టల కోడెక్స్, డిటోనేటర్లు, భారీ మొత్తంలో పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. అంతేకాకుండా దాదాపు 12 వేల కిలోల ఆహార వస్తువులను కూడా స్వాధీనం చేసుకున్నారు. 21 రోజుల పాటు సాగిన ఈ చారిత్రాత్మక నక్సల్ వ్యతిరేక ఆపరేషన్ లో లభించిన సమాచారం ప్రకారం ఈ ఆపరేషన్ లో పలువురు పెద్ద నక్సలైట్లు మరణించడం లేదా తీవ్రంగా గాయపడ్డారు. అయితే, క్లిష్టమైన భౌగోళిక పరిస్థితుల కారణంగా, గాయపడిన లేదా మరణించిన నక్సలైట్లందరి మృతదేహాలను భద్రతా దళాలు ఇంకా వెలికితీయలేకపోయాయి.

ఈ చారిత్రాత్మక ఆపరేషన్ కార్యాచరణ ప్రణాళిక అమలు కోసం పెద్ద సంఖ్యలో బలగాలు, యుద్ధ పరికరాలు, ఇంకా సకాలంలో వాహనాలు, ఆయుధాలు, ఆహారం, వైద్య సదుపాయాల సమీకరణ సమర్థవంతంగా జరిగింది. కేజీహెచ్ ప్రాంతంలోని కఠినమైన, సవాలుతో కూడుకున్న భౌగోళిక పరిస్థితులు, దాక్కోవడానికి అనువైన వందలాది గుహాలు, ఆకస్మిక దాడికి అనుకూలమైన ప్రదేశాలు, ఐఈడీల ప్రమాదాల గురించి సంయుక్త సమావేశంలో ప్రధానంగా బలగాలను హెచ్చరించారు. ఎలాంటి గందరగోళం తలెత్తకుండా ఉండేందుకు భద్రతా దళాలకు వారి ఆపరేషన్ పరిధి గురించి పూర్తి సమాచారం అందించారు.

ఈ ఆపరేషన్ లో భాగంగా బీజీఎల్ షెల్స్, స్థానికంగా ఆయుధాల తయారీ, ఐఈడీలు, ఇతర మారణాయుధాల తయారీకి ఉపయోగించే నాలుగు నక్సల్ టెక్నికల్ యూనిట్లను భద్రతా దళాలు ధ్వంసం చేశాయి. ఈ ఆపరేషన్ లో భాగంగా వివిధ నక్సలైట్ల స్థావరాలు, బంకర్ల నుంచి పెద్ద ఎత్తున రేషన్ సరుకులు, మందులు, నిత్యావసర వస్తువులను స్వాధీనం చేసుకున్నారు.

కీలకమైన ఈ ఆపరేషన్ లో కమాండో బెటాలియన్ ఫర్ రెసల్యూట్ యాక్షన్ (కోబ్రా), స్పెషల్ టాస్క్ ఫోర్స్ (ఎస్టీఎఫ్), డిస్ట్రిక్ట్ రిజర్వ్ గార్డ్స్ (డీఆర్జీ)లకు చెందిన మొత్తం 18 మంది సిబ్బంది వివిధ ఐఈడీ పేలుళ్లలో గాయపడ్డారు. క్షతగాత్రులంతా ప్రాణాపాయం నుంచి బయటపడి వివిధ ఆస్పత్రుల్లో మెరుగైన చికిత్స పొందుతున్నారు. కర్రెగుట్టల వద్ద పరిస్థితులు చాలా క్లిష్టంగా ఉంటాయి. పగటి ఉష్ణోగ్రతలు 45 డిగ్రీల సెల్సియస్ దాటడంతో చాలా మంది సైనికులు డీహైడ్రేషన్ కు గురయ్యారు. అయినప్పటికీ వారిలో మనోధైర్యం తగ్గకపోగా పూర్తి ధైర్యంతో, ఉత్తేజంతో నక్సలైట్లపై అలుపెరుగని ఆపరేషన్ కొనసాగించారు. వివిధ రాష్ట్ర, కేంద్ర సంస్థల మధ్య సమన్వయానికి, మోదీ అనుసరిస్తున్న సమగ్ర ప్రభుత్వ విధానానికి ఈ ఆపరేషన్ అత్యుత్తమ ఉదాహరణగా నిలిచింది. నక్సలైట్ల సాయుధ సామర్థ్యాలను తగ్గించడం, వారి సాయుధ దళాలను నిర్వీర్యం చేయడం, అజ్ఞాత ప్రాంతాల నుంచి నక్సలైట్లను తరిమికొట్టడం, అత్యంత దారుణాలకు పాల్పడే నక్సలైట్ సంస్థ – పిఎల్జిఎ – బెటాలియన్‌ను ధ్వంసం చేయడం ఈ ఆపరేషన్ ప్రధాన లక్ష్యం.

కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఆదేశాల మేరకు ఛత్తీస్ గఢ్ లో భద్రతా దళాలు సంయుక్త కార్యాచరణ ప్రణాళిక కింద నక్సల్స్ కు వ్యతిరేకంగా ఆపరేషన్లు నిర్వహిస్తున్నాయి. కొత్త భద్రతా శిబిరాలను ఏర్పాటు చేయడం ద్వారా భద్రతా అంతరాలను పూడ్చడం, ఈ ప్రాంత సమగ్ర అభివృద్ధి కోసం నక్సల్ ప్రభావిత జిల్లాల్లో అభివృద్ధి పథకాలను సమర్థవంతంగా అమలు చేయడం, తద్వారా స్థానిక పౌరులు ప్రయోజనం పొందేలా చేయడం, అలాగే, కరడు గట్టిన నక్సల్స్ పైన, వారి మొత్తం వ్యవస్థ పైన భద్రతా దళాలు ప్రభావవంతమైన చర్యలు తీసుకోవడం ఈ ప్రణాళిక ముఖ్య అంశాలు. ఈ కార్యాచరణ ప్రణాళిక అమలు ఫలితంగా భద్రతా దళాలు కరడు గట్టిన నక్సల్ దళాలను, వారి వ్యవస్థను భారీగా దెబ్బకొట్టాయి. దీనితో నక్సలైట్ ప్రభావం కలిగిన ప్రాంతం గణనీయంగా తగ్గిపోయింది.

2024లో నక్సలైట్ల వ్యతిరేక ఆపరేషన్ల విజయాన్ని ఆధారంగా చేసుకొని, 2025లో కొనసాగుతున్న ఆపరేషన్లలో గత నాలుగు నెలల్లో భద్రతా దళాలు 197 మంది కరడుగట్టిన నక్సలైట్లను నిర్వీర్యం చేయడం గమనార్హం. 2014లో నక్సలిజం తీవ్రంగా ప్రభావితం చేసిన జిల్లాల సంఖ్య 35 ఉండగా, 2025 నాటికి ఈ సంఖ్య కేవలం ఆరుకి తగ్గిపోయింది. అదేవిధంగా నక్సల్ ప్రభావిత జిల్లాల సంఖ్య 126 నుంచి 18కి తగ్గింది. 2014లో 76 జిల్లాల్లోని 330 పోలీస్ స్టేషన్లలో 1080 నక్సల్ ఘటనలు నమోదు కాగా, 2024లో 42 జిల్లాల్లోని 151 పోలీస్ స్టేషన్లలో కేవలం 374 ఘటనలు మాత్రమే నమోదయ్యాయి. 2014లో నక్సల్స్ హింసలో 88 మంది భద్రతా సిబ్బంది అమరులు కాగా, 2024 నాటికి ఆ సంఖ్య 19కి తగ్గింది. ఎన్ కౌంటర్లలో మరణించిన నక్సలైట్ల సంఖ్య 63 నుంచి 2089కి పెరిగింది. 2024లో 928 మంది నక్సలైట్లు లొంగిపోగా, 2025 మొదటి నాలుగు నెలల్లో 718 మంది లొంగిపోయారు. 2019 నుంచి 2025 వరకు కేంద్ర బలగాలు రాష్ట్ర పోలీసుల సహకారంతో నక్సల్స్ ప్రభావిత రాష్ట్రాల్లో 68 నైట్ ల్యాండింగ్ హెలిప్యాడ్లతో సహ మొత్తం 320 శిబిరాలను ఏర్పాటు చేశాయి. 2014లో 66గా ఉన్న పూర్తి స్థాయి పోలీస్ స్టేషన్ల సంఖ్య ఇప్పుడు 555కు పెరిగింది.

నక్సలైట్లకు వ్యతిరేకంగా జరుగుతున్న ఈ విస్తృత ఆపరేషన్ దీర్ఘకాలిక ఫలితాలను ఇవ్వడం ప్రారంభమయింది. పెద్ద, సాయుధ నక్సల్ యూనిట్లను అనేక చిన్న యూనిట్లుగా బలహీన పడుతున్న దృష్టాంతాలు కనిపిస్తున్నాయి. ఈ ప్రాంతాలపై భద్రతా దళాల పట్టు బిగించడంతో పాటు వారు బీజాపూర్ జిల్లాలోని నేషనల్ పార్క్ ప్రాంతం, నారాయణపూర్ జిల్లాలోని మాడ్ ప్రాంతంలో నిరంతరం ముందుకు సాగుతున్నారు.

# మేళ్లచెర్వు జడ్పీహెచ్ఎస్‌లో పూర్వ విద్యార్థుల సందడి

నల్గొండ, మే 15: సూర్యాపేట జిల్లా మేళ్లచెర్వు జడ్పీహెచ్ఎస్ 2000–2001 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు సిల్వర్ జూబ్లీ వేడుకలను చేసుకున్నారు. తాము విద్యనభ్యసించిన మండల కేంద్రంలోని పాఠశాల ప్రాంగణంలో 25 సంవత్సరాల తర్వాత అంతా కలిసి సందడి చేశారు. నాటి జ్ఞాపకాలను పంచుకుంటూ అప్యాయంగా పలుకరించుకున్నారు. తమకు చదువు చెప్పిన గురువులు నలీం, వెంకట నారాయణ, ఏడుకొండలు, చిన్నప్ప, వెంకట్‌రెడ్డిని శాలువాలు, పుష్పమాలలతో ఘనంగా సత్కరించి షీల్డ్ లు అందజేశారు. అనంతరం ఆట పాటలు, క్విజ్, అంత్యాక్షరీతో ఆనందంగా గడిపి మళ్లీ కలుద్దామంటూ ఒకరికొకరు వీడ్కోలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పల్లేటి నాగార్జున, గణేశ్, నాగేశ్వర్‌రావు, వీరబాబు, సైదులు, రాధిక, పద్మ, శ్రీలక్ష్మీ, భవాని, లక్ష్మీ, పుష్పలత, హైమావతి, సుల్తానాబేగం, చంద్రకళ, విజయకుమారి పాల్గొన్నారు.

# రైల్వే సిబ్బంది గ్రీవెన్స్ పై 'నేస్తం'




నిజామాబాద్, మే 15: రైల్వే సిబ్బంది గ్రీవెన్స్ పై నేస్తం కార్యక్రమాన్ని నిర్వహించినట్లు సీనియర్ డివిజనల్ పర్సనల్ ఆఫీసర్ ఆనంద్ కట్టా (ఐఆర్పిఎస్ ) అన్నారు. ఉద్యోగులతో నమ్మకాన్ని పెంచుకునే ప్రయత్నం, రైల్వే ఉద్యోగులు పర్సనల్ బ్రాంచ్ అధికా రులతో నేరుగా సంభాషించడానికి ఈ కార్యక్రమం వేదికగా పనిచేస్తుందన్నారు. గురువారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని రైల్వే స్టేషన్ లోదక్షిణ మధ్య రైల్వే, హైదరాబాద్ డివిజన్ తన తొలి నేస్తం ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమాన్ని నిర్వహించారు. మొత్తం సౌత్ సెంట్రల్ లో ఆరు డివిజన్లలో ఉండగా, అందులో నిజామాబాద్ డిపోలో సుమారు 800 సిబ్బంది ఉన్నారు.

ఈ కార్యక్రమానికి సీనియర్ డివిజనల్ పర్సనల్ ఆఫీసర్ ఆనంద్ కట్టా ముఖ్యఅతిథిగా హాజరై క్యాంపుని ప్రారంభించారు. ఈసందర్భంగా సీనియర్ డివిజనల్ పర్సనల్ ఆఫీసర్ ఆనంద్ కట్టా మాట్లాడారు. రైల్వే సిబ్బందికి సంబంధించి వివిధ సేవలకు వారి ఫిర్యాదులను విని పించడానికి ఈ కార్యక్రమం వేదికగా పనిచేస్తుందని తెలిపారు. ఈచురుకైన చొరవ అత్యుత్తమ సమస్యల వేగవంతమైన పరిష్కారాన్ని సులభతరం చేయడం, మరింత సానుకూల పని వాతావరణాన్ని పెంపొందించడం, పరిపాలన దాని శ్రామిక శక్తి మధ్య కమ్యూనికేషన్ ను బలోపేతం చేయడం లక్ష్యంగా పెట్టుకుందన్నారు.

ఈ కార్యక్రమంలో సీనియర్ డివిజనల్ పర్సనల్ అధికారి బృందం పాల్గొని సిబ్బంది గ్రీవెన్స్ అడిగి తెలుసుకున్నారు. పలు సిబ్బంది సమస్యలను అప్పటికప్పుడు వెంటనే పరిష్కరించారు. ఇంకా ఫిర్యాదుల స్వభావం ఆధారంగా వలు ఫిర్యాదులను పరిష్కరిస్తానని పరిపాలన హామీ ఇచ్చారు. ఈ శిబిరంలో చేపట్టిన ప్రయత్నాలు హైదరాబాద్ డివిజన్ ఉద్యోగుల సంక్షేమం, సమర్థవంతమైన ఫిర్యాదుల పరిష్కార విధానాలపై దృష్టి సారించాయి. ఈ కార్యక్రమంలో వెల్ఫేర్ ఇన్ స్పెక్టర్లు తులసి కృష్ణ, నీరజ్ కుమార్, చీఫ్ ఓఎస్ గోపాల్ నాయక్, ఆఫీస్ సూప రింటెండెంట్ లు భీం రావ్, హర్షద్ హుస్సేన్, ఎస్పీఎస్ డీలర్ బి.శ్రీనివాసరావు, రైల్వే సిబ్బంది పాల్గొన్నారు.

# మానవ జీవనంలో విప్లవాత్మక మార్పులకు 6జీ ఓ అవకాశం

న్యూఢిల్లీ, మే 15:తదుపరి తరం 6జీ సాంకేతికతల అభివృద్ధిలో అంతర్జాతీయంగా అగ్రగామిగా నిలవడం భారత సంకల్పమని కమ్యూనికేషన్లు, గ్రామీణాభివృద్ధి సహాయ మంత్రి డాక్టర్ చంద్రశేఖర్ పెమ్మసాని స్పష్టం చేశారు. న్యూఢిల్లీలో 'భారత్ 6జీ 2025'– మూడో అంతర్జాతీయ సదస్సు, ప్రదర్శన సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విప్లవాత్మక మార్పులతో సాంకేతికతను అందిపుచ్చుకునే స్థితి నుంచి ప్రమాణాలను నిర్దేశించే స్థాయికి దేశం ఎదిగిందని వ్యాఖ్యానించారు. ఈ రంగంలో ప్రవేశమున్నవారంతా భారత్ 6జీని కేవలం సాంకేతిక అంశంగా కాకుండా జాతీయ లక్ష్యంగా పరిగణించాలని ఆయన కోరారు.

ఆరో తరం (6జీ) కమ్యూనికేషన్ టెక్నాలజీలో దేశం నిర్దేశక స్థాయికి చేరేలా భారత్ రూపొందించిన ప్రణాళికకు అనుగుణంగా కలిసి పనిచేయడం కోసం అంతర్జాతీయ స్థాయి సాంకేతిక దిగ్గజాలు, పరిశోధకులు, విధాన నిర్ణేతలను ఈ సదస్సు ఒక్క చోటకు తెచ్చింది.

భవిష్యత్తు తరాలకు అనుసంధానాన్ని విప్లవాత్మకంగా మెరుగుపరచగల అవకాశంగా 6జీ సాంకేతికతను మంత్రి అభివర్ణించారు. ఆరోగ్య సంరక్షణ, విద్య, వ్యవసాయం వంటి రంగాలతోపాటు స్మార్ట్ సిటీల దిశగా సమూలమైన మార్పులను తీసుకురాగల సామర్థ్యం 6జీకి ఉందన్నారు.

2023 మార్చి 23న ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ప్రారంభించిన భారత్ 6జీ ప్రణాళిక.. భారత్‌లో 2030 నాటికి 6జీ టెక్నాలజీలను రూపొందించి, అభివృద్ధి చేసి, అమలు చేయడానికి ఓ ప్రతిష్ఠాత్మకమైన మార్గాన్ని సిద్ధం చేసిందని డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. భారత్ 6జీ కూటమి, 111కు పైగా పరిశోధన ప్రాజెక్టులకు నిధులందించడంతోపాటు జపాన్, సింగపూర్, ఫిన్లాండ్ దేశాలతో అంతర్జాతీయ భాగస్వామ్యాలు, టెరాహెర్ట్జ్ కమ్యూనికేషన్, దేశీయంగా ఏఐ నెట్వర్క్‌లో పురోగతి ద్వారా 2030 నాటికి 6జీలో దేశాన్ని అంతర్జాతీయంగా అగ్రగామిగా నిలపడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఆయన పేర్కొన్నారు.

సాంకేతికంగా 6జీకి ఆశాజనకమైన పరిస్థితులున్నాయన్నారు. "6జీ ఓ చిన్న క్రమానుగత అభివృద్ధి మాత్రమే కాదు, సమూలమైన పరివర్తన... టెరాహెర్ట్జ్ ఫ్రీక్వెన్సీ బ్యాండ్లు, సెకనుకు 1 టెరాబిట్ వేగం, జాప్యాన్ని మిల్లీ సెకన్ల కన్నా తక్కువకు తగ్గించడం, స్వీయ సమస్య పరిష్కార నెట్వర్కులు, జలగర్భం నుంచి అంతరిక్షం వరకు ? భారీ పరిమాణంలో డేటాను అందించగల అనుసంధాయకతకు 6జీ ద్వారా అవకాశం లభిస్తుంది" అని మంత్రి చెప్పారు.

సురక్షిత, సమ్మిళిత, అంతర్జాతీయ స్థాయి ఔచిత్యం కలిగిన 6జీ వ్యవస్థ ప్రధానమంత్రి శ్రీ మోదీ లక్ష్యమని డాక్టర్ పెమ్మసాని పునరుద్ఘాటించారు. మానవాళి ప్రయోజనం కోసం సాంకేతికతను అభివృద్ధి చేయడం, అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలను రూపొందించడం, డిజిటల్ పరివర్తనను ముందుకు తీసుకెళ్లడం భారత్ విధానమని స్పష్టం చేశారు. ఈ మిషన్‌కు చేయూతనిచ్చేందుకు ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని మంత్రి భరోసా ఇచ్చారు. ప్రపంచ 6జీ ప్రస్థానంలో ముందంజలో నిలవడానికి అవసరమైన స్థాయి, ఆవిష్కరణ సామర్థ్యం, రాజకీయ సంకల్పం భారత్‌కు ఉన్నాయని పునరుద్ఘాటిస్తూ ప్రసంగాన్ని ముగించారు.

# నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకం డొల్ల ప్రాజెక్ట్ : మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి



మక్తల్ , మే 15: కొడంగల్ నియోజకవర్గ ప్రజలను మోసం చేసేందుకు ముఖ్యమంత్రి నారాయణపేట– కొడంగల్ ఎత్తిపోతల పథకం తీసుకొస్తానని నియోజకవర్గ ప్రజలను మోసం చేస్తున్నారని మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి ఆరోపించారు. గురువారం మక్తల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

నియోజకవర్గంలో బీమా ఫేస్ వన్ అంతర్భాగమైన భూత్పూర్ రిజర్వాయర్ నుంచి కొడంగల్ నియోజకవర్గానికి నీటిని ఏ విధంగా తీసుకువెళ్తారో రేవంత్ రెడ్డి బహిరంగంగా అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేసి అందరకు అర్థమయ్యేలా వివరించి చెప్పాలని డిమాండ్ చేశారు. మక్తల్ మండలంలో ఉన్న భూత్పూర్ రిజర్వాయర్ 1.3 టీఎంసీ సామర్థ్యం ఉంటే రిజర్వాయర్ నుంచి కొడంగల్‌కు 90 కిలోమీటర్ల మేర పైపులైన్ ద్వారా ఒక టీఎంసీ నీటిని కొడంగల్‌కు ఏ విధంగా తీసుకెళ్తారో సీఎం వివరించాలన్నారు.

నారాయణపేట–కొడంగల్ ఎత్తిపోతల పథకం నిర్మించేందుకు డీపీవో రిపోర్టులు, ఫారెస్ట్ క్లియరెన్స్, భూ సేకరణ , కృష్ణ బోర్డు నుంచి అనుమతులు ఏమాత్రం లేకుండా ప్రాజెక్టు ఏ విధంగా చేపడతారని ప్రశ్నించారు. ఈ ప్రాజెక్ట్ నిర్మాణం కోసం రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి చెందిన రాఘవ కన్‌స్ట్రక్షన్ టెండర్లు దక్కించుకున్న విషయం రాష్ట్ర ప్రజలందరికీ తెలుసని పేర్కొన్నారు. ప్రాజెక్టు పనులు ప్రారంభం కాకముందే పైపుల నిర్మాణం చేపట్టామంటూ 100 కోట్ల బిల్లు ఏ విధంగా పెట్టుకుంటారని, ఆరోపిం చారు.

ప్రాజెక్టు పనులకు ఎలాంటి అనుమతులు లేకుండా ముందస్తుగానే వంద కోట్ల బిల్లు పెట్టడానికి చూస్తుంటే కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధి ఏమిటో అర్థమవుతుందని అన్నారు. నీటిని తీసుకువెళ్లేందుకు అవసరమైన భూసేకరణ చేపట్టడం కోసం అధికారులు తమ వెంబడి పోలీస్ బలగాలను వేసుకువెళ్లి రైతులను భయభ్రాంతులకు గురిచేయడం మానుకోవాలని సూచించారు. ప్రాజెక్టు నిర్మాణం చేపట్టేందుకు కచ్చితంగా భూసేకరణ చేసే విధానాన్ని అఖిలపక్ష సమావేశాన్ని పెట్టి బహిరంగంగా రైతన్నలకు మార్కెట్ విలువ ప్రకారంగా పరిహారం చెల్లిస్తే తప్ప ప్రాజెక్టును నిర్మాణానికి సహకరించబోమని హెచ్చరించారు.

ఈ ప్రాజెక్టు నిర్మాణం వల్ల మక్తల్ నియోజకవర్గం లోని నర్వ, అమరచింత, ఆత్మకూరు మండలాలకు సాగునీరు చాలా ఇబ్బంది అవుతుందన్నారు. భూత్పూర్ రిజర్వాయర్ లో చుక్క నీరు లేకున్నా కొడంగల్ నియోజకవర్గానికి నీటిని ఏ విధంగా తరలిస్తారో ముఖ్యమంత్రి బహిర్గతం చేయాలనీ డిమాండ్ చేశారు. రిజర్వాయర్ల పై, నీటి సరాఫరా ఎలాంటి అవగాహన లేని ముఖ్యమంత్రి తో పాటు ఎమ్మెల్యేలకు రిజర్వాయర్ల పరిస్థితి ఏసమావేశంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు శ్రీనివాస్ గుప్తా, మాజీ జడ్పీటీసీలు అరవింద్, అశోక్ గౌడ్, నర్వ మండల పార్టీ అధ్యక్షులు మహేశ్వర్ రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రాజేష్ గౌడ్, పట్టణ అధ్యక్షులు చిన్న హనుమంతు, మున్సిపల్ మాజీ కౌన్సిలర్లు రాములు, మొగులప్ప, నాయకులు అన్వర్ హుస్సేన్, గాల్ రెడ్డి, జట్ల శంకర్, నరసింహారెడ్డి, కృష్ణ, మన్నన్, జుట్ల సాగర్, శివారెడ్డి, అశోక్ గౌడ్, బాలప్ప తదితరులు ఉన్నారు.

# సుశిక్షితులైన వైద్యులుగా తయారు కావాలి : ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు



హైదరాబాద్, మే 15: వైద్య వృత్తి ఎంతో పవిత్ర మైనదని, వైద్య విద్యను అభ్యసించే అవకాశం రావడం గర్వకారణమని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కే రామకృష్ణారావుఅన్నారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత తొలిసారిగా గురువారం నారాయణపేట మండలం అప్పక్ పల్లి గ్రామ సమీపంలో గల ప్రభుత్వ వైద్య కళాశాలను సందర్శించారు.

కళాశాల వద్ద జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్, ఎస్పీ యోగేష్ గౌతమ్, స్థానిక సంస్థల జిల్లా అదనపు కలెక్టర్ సంచిత్ గ్యాంగ్వర్, మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రామ్ కిషన్, కడ ప్రత్యేక అధికారి వెంకట్ రెడ్డి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పోలీసులు ఆయనకు గౌరవ వందనం చేశారు. అనంతరం మెడికల్ కళాశాలలో మెడికల్, నర్సింగ్, పారా మెడికల్ విద్యార్థులతో సీఎస్ ఇంట్రాక్ట్ అవుతూ కళాశాలలో చదువు కోవడం ఎలా అనిపిస్తుందని విద్యార్థుల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ.. ఉమ్మడి పాలమూరు జిల్లాతో తనకు అవినాభావ సంబంధం ఉందని, పాలమూరు జిల్లాలో 1996 లో పని చేశానని తెలిపారు. పాలమూరు జిల్లాలో వెనుక బడిన ప్రాంతమైన నారాయణపేట జిల్లా సమస్యలను అధిగమించి ముందుకు వెళ్లాలన్నారు. మెడికల్ కళాశాలలో అన్ని వసతి సౌకర్యాలు ఉన్నాయని, విద్యార్థులు చదువుకుని తల్లిదండ్రుల కలను నెరవేర్చాలని సూచించారు.

కళాశాల నుంచి సుశిక్షితులైన వైద్యులుగా తయారై ప్రజలకు మెరుగైన వైద్య సేవలుఅందించాలని తెలిపారు. మెరుగైన సేవలు అందించినప్పుడే వృత్తి కి న్యాయం చేసిన వాళ్లం అవుతాం అన్నారు. కళాశాల కాన్ఫరెన్స్ హాల్ లో కళాశాల ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లతో కళాశాల నిర్వహణ, ఇతర వసతి సౌకర్యాల గురించి చర్చించారు. ప్రభుత్వం హెల్త్ కేర్ పై ప్రత్యేక దృష్టి పెట్టిందని, నారాయణ పేట మెడికల్ కళాశాల రాష్ట్రంలోని మిగతా కళాశాలలకు ఒక మోడల్ గా నిలవాలని ఆయన ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో ఆర్డీవో రామచందర్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జయ చంద్రమోహన్, టిజీ ఎం ఎస్ ఐ డి సి సీ. ఈ దేవేందర్, ఈ ఈ రవీందర్, డీ. ఈ. కృష్ణమూర్తి, వైద్య నిపుణులు పాల్గొన్నారు.

మెడికల్ కళాశాల సందర్శన అనంతరం సింగారం మలుపు దారి వద్ద జిల్లా మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పెట్రోల్ పంప్ ను పరిశీలించారు.

# ప్రతి మొక్క బతికేలా చర్యలు తీసుకోవాలి : డీఆర్డీఓ శేఖర్‌రెడ్డి

నల్గొండ, మే 15: నర్సరీలో పెంచే ప్రతి మొక్క బతికేలా నిర్వాహకులు చర్యలు తీసుకోవాలని డీఆర్‌డీఓ శేఖర్‌రెడ్డి అన్నారు. గురువారం నల్లగొండ జిల్లా కట్టంగూర్ మండలంలోని కురుమర్తి గ్రామ నర్సరీని పరిశీలించి మొక్కల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నర్సరీల్లోని మొక్కలను ఏడు భాగాలుగా విభజించి బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. జూన్ చివరి వారంలోగా మొక్కలు రెండున్నర నుంచి మూడు ఫీట్ల వరకు ఎదుగుదల ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. నర్సరీలో మొక్కల పెంపకాన్ని వేగవంతం చేయడంతో పాటు చనిపోయిన మొక్కల స్థానంలో కొత్తవి నాటాలన్నారు.

జూన్‌లో వర్షాలు పడగానే మొక్కలన్నీ నాటడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. ఎరసానిగూడెం, నారెగూడెం గ్రామాల నర్సరీలను పూర్తిస్థాయిలో పరిశీలించి నివేదికను సమర్పించాలని ఎంపీఓను, ఉపాధి కూలీలకు కనీస వేతనం రూ.307 తగ్గకుండా చర్యలు చేపట్టాలని ఏపీఓ, ఈజీఎస్ సిబ్బందిని ఆదేశించారు. మొక్కల పెంపకంలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట క్లస్టర్ వీడీ నర్సింహ్మారావు, ఎంపీఓ చింతమల్ల చలపతి, ఏపీఓ కడెం రాంమోహన్, ఏపీఎం సైదులు, కార్యదర్శులు జయసుధ, పెద్దయ్య, శేఖర్, ఈసీ శ్రీధర్, నర్సరీ నిర్వహాకులు పాల్గొన్నారు.

# రామగుండం బల్దియాలో అవినీతికి తావు లేదు..

## స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే.అరుణ శ్రీ

కరీంనగర్, ఏప్రిల్ మే 15: రామగుండం నగర పాలక సంస్థలో ఎలాంటి అవినీతి, అక్రమాలకు తావు ఉండదు.. ఒకవేళ ఏమైనా లోపాలు తలెత్తితే నా దృష్టికి తీసుకవస్తే తప్పకుండా చర్యలు తీసుకుంటా.. అని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, నగర పాలక సంస్థ కమిషనర్ (ఎఫ్ఏసీ) జే. అరుణ శ్రీ స్పష్టం చేశారు. ఈమేరకు గురువారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ రామగుండం నగర పాలక సంస్థలో అవినీతికి చోటు లేదనీ, నిర్ణీత వ్యవధిలోనే ఫిర్యాదుల పరిష్కారం, ధృవీకరణ పత్రాల జారీ తదితర అన్ని రకాల సేవలు సామాన్య ప్రజలకు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

నగర పాలక సంస్థ అధికారులు, సిబ్బంది నిజాయితీగా, సమర్థవంతంగా సేవలందిస్తున్నారనీ, ఏమైనా లోపాలు తలెత్తితే తన దృష్టికి తీసుకురావాలని అన్నారు. ఎవరైనా లంచం అడిగితే అవినీతి నిరోధక శాఖ అధికారులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. అవినీతి నిరోధక శాఖ టోల్ ఫ్రీ నం. 1064, సెల్ నం.9440446106 అందరికీ తెలిసేలా తన ఆదేశాల మేరకు కార్యాలయంలో పలు చోట్ల నగర పాలక సంస్థ ఆధ్వర్యంలోనే బోర్డులు ఏర్పాటు చేయించినట్లు పేర్కొన్నారు.

జీవజలం చలం

సాహిత్య స్మారకోపన్యాస సభ

18.5.2025 ఆదివారం సాయంత్రం 6 గంటలకు రవీంద్రభారతి, కాన్ఫరెన్స్ హాలులో
చలం సాహిత్య స్మారకోపన్యాస సభ జరుగుతుంది

చలం స్త్రీ, ప్రేమలేఖల గ్రంథాలపై
కె. ఎన్. మల్లీశ్వరి, నెల్లుట్ల రామాదేవి ప్రసంగిస్తారు

మామిడి హరికృష్ణ ఆప్తవాక్యం పలుకుతారు

చలం స్త్రీ, ప్రేమలేఖలలోని కొన్ని ముఖ్య భాగాలను -
డా. సలీమా, డా. లక్ష్మీ అవిరెడ్డి, డా. దాసోజ పద్మావతి, డా. శ్రీ భాష్యం అనురాధ,
నస్రీన్ ఖాన్ లు వినిపిస్తారు

ఈ సభకు మీరు తప్పక రావాలని మనవి



-- నాళేశ్వరం శంకరం
కన్వీనర్, చలం భావన

